www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి

EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:59 FRIDAY ,JULY 10,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 59 శుక్రవారం 10 జూలై 2026 పేజీలు :8 వెల: 4/-





## బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న నిధులు స్వచ్ఛమైనవి కావన్న కవిత

2

- బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ. 1,400 కోట్లపై విచారణ జరిపించాలి: కవిత
- ఆ డబ్బులు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చాయని ఆరోపణ
- ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీలో చేరనని వ్యాఖ్య

బీఆర్ఎస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 1,400 కోట్ల నిధులు స్వచ్ఛమైనవి కావని అన్నారు.

# జూలై 10న చింతకానిలో భారీ రైతు ఆశీర్వాద సభ



హంసకలం వార్త : జూలై 10న ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధ పురం గ్రామం మత్కేపల్లి క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపు నిచ్చారు. గురువారం చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో డిప్యూటీ సీఎం, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో కలిసి రైతు భరోసా ఆశీర్వాద సభపై మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.డిప్యూటీ సీఎం మిగతా2లో

-హాజరవుతారని అంచనా.. సభకు ప్రతి రైతు హాజరై ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని పిలుపు..

-9 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ..

-వ్యవసాయ, అనుబంధ రంగాల కోసం 1,67,877 కోట్లు వ్యయం..

-రైతు భరోసా, ఆశీర్వాద సభ ఏర్పాట్లపై మీడియా సమావేశం

## హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించడమే నా డ్రీమ్

- స్పోర్ట్స్ వర్సిటీ లోగో, వెబ్‌సైట్ లాంచ్‌లో ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు
- 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం.. హైదరాబాద్ కూడా వేదిక కావాలి!
- గత 20 ఏళ్లలో రాష్ట్రంలో పెద్ద స్పోర్ట్స్ ఈవెంట్స్ జరగలేదు: రేవంత్ అసంతృప్తి



హంసకలం వార్త : భాగ్యనగర కీర్తికిరీటంలో మరో అంతర్జాతీయ మైలురాయిని చేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భవిష్యత్తులో హైదరాబాద్ మహానగరంలో ఒలింపిక్స్ క్రీడలను నిర్వహించాలనేదే తన ప్రధాన ఆశయమని, అది తన డ్రీమ్ అని ఆయన ప్రకటించారు. గురువారం జరిగిన స్పోర్ట్స్ యూనివర్సిటీ లోగో మరియు వెబ్‌సైట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగి ంచారు. మిగతా2లో

# 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం



హంసకలం వార్త : తెలంగాణలో బెస్ట్ ఇండస్ట్రియల్ పాలసీ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారంజిల్లా పర్యటనలో భాగంగా సీతారాంపూర్ ప్రీమియర్ ఎనర్జీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారతదేశ అత్యాధునిక నెక్స్‌జెన్ సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. ప్రపంచంలో బెస్ట్ లివింగ్ సిటీగా హైదరాబాద్ ఉందన్నారు. భాగ్యనగరాన్ని కూడా కాలుష్య సమస్య వేధిస్తోందని చెప్పారు. మూసీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించామన్నారు. కోర్ అర్బన్ ఏరియాను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక పాలసీ రూపొందించనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలను ఔటర్ అవతలకు తరలించబోతున్నామని సీఎం తెలిపారు. ఓఆర్ఆర్ అవతల పరిశ్రమలకు భూములు కేటాయిస్తామన్నారు. ORR, RRR మధ్య పారిశ్రామికవాడలు ఏర్పాటు కానున్నాయన్నారు. RRR బయట అగ్రి ఎకానమీ డెవలప్ చేస్తున్నామని చెప్పారు. మిగతా2లో

# మూసీ పునరుజ్జీవన పనులకు గ్రీన్ సిగ్నల్..

**రూ.7,345 కోట్ల ప్రాజెక్టుకు ప్రభుత్వం ఆమోదం**




హంసకలం వార్త : మూసీ పునరు జ్జీవన ప్రాజెక్ట్ తొలి దశ పనులకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజె క్టుకు రూ.7,345.12 కోట్ల పరిపా లనా అనుమతులు ఇస్తూ అధి కారిక ఉత్తర్వులు జారీ మిగతా2లో

# హరీశ్ రావు అంత నిష్ణాతుడైతే.. కేసీఆర్ ఎందుకు తీసేశారు?

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్!**



- సాగునీటి రంగంపై విమర్శలు గుప్పించిన హరీశ్ కు ఉత్తమ్ కౌంటర్
- పెద్ద నిష్ణాతుడైనట్టు హరీశ్ మాట్లాడుతున్నారని ఎద్దేవా
- హరీశ్ విమర్శలకు సరైన సమయంలో సమాధానం చెబుతామని వ్యాఖ్య

హంసకలం వార్త :సాగునీటి రంగంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చేసిన విమర్శలపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటుగా స్పందించారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మిగతా2లో




# భారత్‌తో వాణిజ్య ఒప్పందం

**న్యూజిలాండ్ వ్యాపారాలకు భారీ ఊతం: లక్సన్**

హంసకలం వార్త : భారత్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) న్యూజిలాండ్ వ్యాపారాలకు భారీ అవకాశాలు తీసుకురానుందని ఆ దేశ ప్రధాని క్రిస్టఫర్ లక్సన్ తెలిపారు. ఒప్పందం అమల్లోకి వచ్చిన తొలి రోజునే న్యూజిలాండ్ ఎగుమతుల్లో 57 శాతం వస్తువులు సుంకం 7లో

## నిరుద్యోగులకు గుడ్ న్యూస్..

**తెలంగాణ ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టులు**



- పర్మినెంట్ ప్రాతిపదికన కండక్టర్ ఉద్యోగాల భర్తీ
- రాత పరీక్ష, ఇంటర్వ్యూ లేకుండానే నియామకాలు
- పదో తరగతి మార్కుల ఆధారంగా ఉద్యోగాలు

హంసకలం వార్త : నిరుద్యోగ యువతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదిరిపోయే శు భవార్త చెప్పింది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) లో ఖాళీగా ఉన్న 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నియామక ప్రక్రియను ఆర్టీసీ యాజమాన్యమే నేరుగా చేపట్టబోతు ండగా... చాలా సంవత్స రాల తర్వాత తెలంగాణలో పర్మినెంట్ (శాశ్వత) ప్రాతిపదికన కండక్టర్ ఉద్యోగాలను మిగతా2లో

## సింగరేణి బకాయిలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తాం



హంసకలం వార్త :డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కౌంటర్ ఇచ్చారు. తాడిచర్ల-2 గని కేటాయింపు పూర్తిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృషి ఫలితమేనని అన్నారు. యూపీఏ-2 ప్రభుత్వ హయా ంలో రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్న ప్పటికీ తాడి చర్ల-2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించ లేకపోయిందని విమర్శించారు. సింగరేణికి మీరేం చేశారని భట్టి విక్రమార్కను ప్రశ్నిం చారు. తెలంగాణ బిడ్డగా, సింగరేణి కార్మికుల ప్రయోజ నాలను దృష్టిలో మిగతా2లో

## డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం మీడియా కృషి చేయాలి



హంసకలం వార్త : డ్రగ్స్ నిర్మూలనను ప్రజా ఉద్యమంగా మార్చడంలో మీడియా కీలక భాగస్వామిగా ఉండాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో నిరంతర అవగాహన కల్పించడంలో మీడియా ముందుండాలని పేర్కొన్నారు. ప్రతి ఇంటిని, ప్రతి గ్రామాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పుకొచ్చారు. గురువారం హనుమకొండలో గవర్నర్ పర్యటించి, పలు



## పోక్సో కేసులో బండి భగీరథ్‌కు హైకోర్టు బెయిల్

పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ. లక్ష పూచీకత్తుతో పాటు కోర్టు నిర్దేశించిన షరతుల మేరకు బెయిల్ మంజూరైంది.

# మూసీ పునరుజ్జీవన పనులకు గ్రీన్ సిగ్నల్..

మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జోన్-1ఏ, జోన్-1బీ ప్రాధాన్య కారిడార్లలో మూసీ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కి.మీ., ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కి.మీ. మేర అభివృద్ధి పనులు కొనసాగనున్నాయి. మొత్తం 21 కి.మీ. ప్రాధాన్య స్ట్రెచ్‌లో రివర్‌ఫ్రంట్ పనులు జరుగనున్నాయి. భూసేకరణ వ్యయం మినహా రూ.7,345.12 కోట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో ఏడీబీ నుంచి రూ.4,500 కోట్ల రుణాన్ని తీసుకోనుండగా.. మిగతా రూ.2,845.12 కోట్లు HMDA లేదా TGIIC నుంచి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ పనులను ఈపీసీ (EPC) విధానంలో నిర్వహించనున్నారు. ప్రాజెక్టు పర్యవేక్షణకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ(PMC) నియామకానికి సర్కార్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని ఎమ్ఆర్‌డీసీఎల్ (MRDCL)కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించడమే నా డ్రీమ్

**20 ఏళ్ల స్తబ్దత వీడాలి.. పాత వైభవం రావాలి!**

గత ఇరవై ఏళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో ఎలాంటి పెద్ద అంతర్జాతీయ స్పోర్ట్స్ ఈవెంట్స్ నిర్వహించకపోవడంపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో 1990 నుండి 2004 మధ్య కాలంలో హైదరాబాద్ నగరం ఎన్నో ప్రతిష్టాత్మక జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు అత్యంత విజయవంతంగా ఆతిథ్యం ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. మళ్లీ ఆ నాటి క్రీడా వైభవాన్ని హైదరాబాద్‌కు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

**2036 ఒలింపిక్స్ టార్గెట్!**

భారతదేశం 2036 ఒలింపిక్ క్రీడల ఆతిథ్యం కోసం రేసులో ఉందని, కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశానికి గనుక ఈ అవకాశం దక్కితే.. అందులో హైదరాబాద్ కూడా ఒక ప్రధాన వేదికగా నిలవాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఒలింపిక్స్ వంటి విశ్వక్రీడల నిర్వహణకు అవసరమైన ప్రపంచస్థాయి మౌలిక వసతులను, స్టేడియంలను సిద్ధం చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు వెల్లడించారు.

**క్రీడాకారులకు స్పోర్ట్స్ వర్సిటీ కొండంత అండ**

రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు మరియు అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లను తయారు చేసేందుకే స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చినట్లు సీఎం తెలిపారు. తాజాగా ప్రారంభించిన లోగో, వెబ్‌సైట్ ద్వారా క్రీడాకారులకు అవసరమైన సమాచారం, శిక్షణ వివరాలు సులభంగా అందుబాటులోకి వస్తాయన్నారు. క్రీడారంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# జూలై 10న చింతకానిలో భారీ రైతు ఆశీర్వాద సభ....

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ వానాకాలం పంట సీజన్‌కు సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా పెట్టుబడి సహాయాన్ని అందించిన నేపథ్యంలో జూలై 10న రైతు ఆశీర్వాద సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మంత్రివర్గసభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 3 లక్షల మంది రైతులు ఈ సభకు హాజరవుతారని అంచనా వేస్తున్నామని తెలిపారు. ప్రతి రైతు ఈ కార్యక్రమానికి విచ్చేసి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. రైతులే రాష్ట్రానికి వెన్నెముక అని, రైతులకు ప్రతి అడుగులో అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని చెప్పారు.గత ప్రభుత్వం రైతు భరోసా పథకం క్రింద పదేళ్లలో మొత్తం రూ.72 వేల కోట్లు మాత్రమే అందించిందని, తమ ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్లలోనే రైతు భరోసా క్రింద రూ.35,830 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు.వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటివరకు ఒక లక్ష 67 వేల 877 కోట్లను వెచ్చించిందన్నారు. రైతు రుణమాఫీ, ధాన్యానికి బోనస్, పంటల బీమా, పంట నష్టపరిహారం, ఉచిత విద్యుత్, విద్యుత్ సబ్సిడీ, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పలు రైతు సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఈ నిధులను వినియోగించినట్లు వివరించారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సహాయాన్ని అందిస్తున్నామని వెల్లడించారు.ఖమ్మం జిల్లా అంటేనే వ్యవసాయానికి ప్రతీక అని, నాగార్జునసాగర్ వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులతో ఈ ప్రాంతం వ్యవసాయాభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని, భవిష్యత్తులో రైతులకు మరింత మేలు చేసే కార్యక్రమాలను అమలు చేస్తామని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయడంలో మీడియా ప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలని, కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.ఈ సమావేశంలో మీడియా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హరీశ్ రావు అంత నిష్ణాతుడైతే.. కేసీఆర్ ఎందుకు తీసేశారు?

సాగునీటి రంగంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చేసిన విమర్శలపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటుగా స్పందించారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... హరీశ్ రావుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇరిగేషన్‌లో హరీశ్ రావు ఏదో పెద్ద నిష్ణాతుడైనట్లు మాట్లాడుతున్నారని మంత్రి ఉత్తమ్ ఎద్దేవా చేశారు. "హరీశ్ రావుకు అంత సత్తా ఉంటే, గత ప్రభుత్వంలో ఆయన మామ కేసీఆర్ ఆయనను ఆ శాఖ నుంచి ఎందుకు తొలగించారు? హరీశ్ రావు పనితీరుపై నమ్మకం లేకనే కేసీఆర్ ఆయనను రాత్రికి రాత్రే నీటి పారుదల శాఖ నుంచి తీసేశారు" అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా హరీశ్ రావు ప్రెజెంటేషన్లు ఇస్తున్నారని, ఆయన చూపించిన అబద్ధపు గణాంకాలకు తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. హరీశ్ రావు చేసిన ప్రతి విమర్శకు సరైన సమయంలో, ఆధారాలతో సహా పూర్తి సమాధానం చెబుతామని మంత్రి స్పష్టం చేశారు.

# ఎయిడ్స్ నియంత్రణలో భేష్..'వికారాబాద్'కు జాతీయ స్థాయి గుర్తింపు

హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ, నియంత్రణ, చికిత్సలో విశిష్ట పనితీరు కనబర్చినందుకు వికారాబాద్ జిల్లాకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధించినందుకు గాను సక్షం సర్టిఫికెట్ ప్రకటించారు. దేశ వ్యాప్తంగా కేవలం 70 జిల్లాలు మాత్రమే భారత ప్రభుత్వం, జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన ప్రమాణాలను పూర్తి చేయగా, వాటిలో వికారాబాద్ జిల్లాకు చోటు దక్కింది.

**95శాతం గుర్తింపు**

జిల్లాలో హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల్లో కనీసం 95 శాతం మందికి తమ స్థితిని గుర్తించే లక్ష్యాన్ని విజయవంతంగా చేరుకున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 4,536 మంది హెచ్ఐవీ బాధితులను గుర్తించి వారందరికీ ఉచితంగా యాంటీ రెట్రో వైరల్ థెరఫీ అందిస్తున్నట్లు వెల్లడించారు. హెచ్ఐవీని ముందస్తుగా గుర్తించడం నిర్ధారణ అయిన వెంటనే టెస్ట్ అండ్ ట్రీట్ విధానంలో చికిత్స ప్రారంభించడం, రోగులకు నిరంతర కౌన్సెలింగ్, ఫాలో అప్ సేవలు అందించడం ద్వారా ఈ లక్ష్యాలను సాధించినట్లు అధికారులు తెలిపారు. హెచ్ఐవీతో జీవిస్తున్న ప్రతీ వ్యక్తి క్రమం తప్పకుండా ఏఆర్టీ మందులు తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన జీవితం గడపడమే కాకుండా, ఇతరులకు వ్యాధి సంక్రమించే ప్రమాదం కూడా తగ్గుతుందని అధికారుల చెబుతున్నారు.

**అపోహలు, భయాలు వీడాలి**

ప్రజలు హెచ్ఐవీపై ఉన్న అపోహలు, భయాలు, వివక్షను వీడాలి. సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా ఐసీటీసీ కేంద్రంలో ఉచితంగా పరీక్షలు చేయించుకుని, అవసరమైతే వెంటనే చికిత్స ప్రారంభించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సహకరించాలి.

# నిరుద్యోగులకు గుడ్ న్యూస్.. తెలంగాణ ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టులు

నిరుద్యోగ యువతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదిరిపోయే శుభవార్త చెప్పింది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC)లో ఖాళీగా ఉన్న 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నియామక ప్రక్రియను ఆర్టీసీ యాజమాన్యమే నేరుగా చేపట్టబోతుండగా... చాలా సంవత్సరాల తర్వాత తెలంగాణలో పర్మినెంట్ (శాశ్వత) ప్రాతిపదికన కండక్టర్ ఉద్యోగాలను భర్తీ చేస్తుండటం విశేషం. ఈ నోటిఫికేషన్‌లో అభ్యర్థులకు ఊరటనిచ్చే అత్యంత ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈ ఉద్యోగాలకు ఎలాంటి రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించడం లేదు. కేవలం టెన్త్ క్లాస్ లో సాధించిన మార్కుల శాతాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు. ప్రభుత్వం నిర్దేశించిన రోస్టర్ విధానం, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం అభ్యర్థుల మెరిట్ లిస్ట్‌ను సిద్ధం చేసి నేరుగా ఎంపిక ప్రక్రియ చేపడతారు. ఎలాంటి పోటీ




పరీక్షలు లేకుండానే ప్రభుత్వ ఉద్యోగం సాధించే సువర్ణావకాశం కావడంతో నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో పర్మినెంట్ బేసిస్‌పై కండక్టర్ పోస్టులను భర్తీ చేయడం ఇదే మొదటిసారి. గత కొన్నేళ్లుగా చాలా మంది ఉద్యోగులు రిటైర్ కావడంతో ఖాళీలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్ లాంటి మహానగరాల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఇప్పటివరకు తాత్కాలికంగా ఔట్‌సోర్సింగ్ సిబ్బందితోనే బస్సులను నడిపించారు. ఇప్పుడు నేరుగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి అనుమతి రావడంతో ఆర్టీసీ రూపురేఖలు మారనున్నాయి. అయితే, అఫీషియల్ నోటిఫికేషన్ విడుదలకు ముందు ఒక చిన్న సాంకేతిక సమస్య ఎదురైంది. గతంలో ఎస్ఎస్‌సీ బోర్డు మార్కుల విధానాన్ని అమలు చేయగా.. ఆ తర్వాత కొన్నేళ్ల పాటు జీపీఏ గ్రేడింగ్ విధానాన్ని తెచ్చింది. మళ్లీ ఇటీవల మార్కుల విధానాన్ని కొనసాగిస్తోంది. దీనివల్ల అప్లై చేసుకునే అభ్యర్థుల్లో కొందరికి మార్కులు, మరికొందరికి కేవలం గ్రేడింగ్ మాత్రమే సర్టిఫికేట్లలో ఉన్నాయి.దీంతో జీపీఏ గ్రేడింగ్‌ను మార్కుల శాతంలోకి ఎలా కన్వర్ట్ చేయాలి? ఇరు విధానాల అభ్యర్థులను సమానంగా ఎలా అంచనా వేయాలనే దానిపై స్పష్టత ఇవ్వాలని ఆర్టీసీ అధికారులు ఎస్ఎస్‌సీ బోర్డుకు లేఖ రాశారు. బోర్డు నుంచి ఈ మార్గదర్శకాలు అందిన వెంటనే కండక్టర్ ఉద్యోగాల అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది.

## 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం

2034 నాటికి 1 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశ జీడీపీలో 10శాతం వాటా తెలంగాణ నుంచే ఉండాలన్నారు. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే స్కిల్ వర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న నిధులు స్వచ్ఛమైనవి కావన్న కవిత

ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 1,400 కోట్ల నిధులు స్వచ్ఛమైనవి కావని అన్నారు. అవన్నీ క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవేనని ఆరోపించారు. ఆ నిధులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, ఆ డబ్బును తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు పంచాలి అని డిమాండ్ చేశారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ పార్టీలో చేరే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా చేపట్టిన 'సింగరేణి బాయి బాట' కార్యక్రమంలో భాగంగా తాను క్షేత్రస్థాయిలో కార్మికులతో మమేకమవుతున్నట్లు కవిత తెలిపారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలు, చెల్లించాల్సిన బకాయిల కారణంగా సింగరేణి సంస్థపై పెను భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంస్థ ఎంతటి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందంటే... కనీసం కార్మికులకు అవసరమైన పనిముట్లు (మైనింగ్ పరికరాలు) కూడా కొనలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. "ఇక్కడ అధికారులకు ఓ రూల్... రాత్రింబవళ్లు కష్టపడే కార్మికులకు మరో రూల్‌లా యాజమాన్యం వ్యవహరిస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్రంలోని బీజేపీ వైఖరి వల్ల తెలంగాణ హక్కుగా ఉన్న బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్‌పరం అవుతున్నాయని కవిత విమర్శించారు. తెలంగాణ రాకముందు సింగరేణిలో 62 వేల మంది రెగ్యులర్ కార్మికులు ఉండగా, నేడు ఆ సంఖ్య 38 వేలకు పడిపోయిందని గుర్తుచేశారు. కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. "కార్మికుల వారసత్వ (డిపెండెంట్) ఉద్యోగాల కోసం నెలలో కనీసం రెండు సార్లు మెడికల్ బోర్డ్ నిర్వహించాలి. ఒకవేళ ప్రభుత్వం, యాజమాన్యం డిపెండెంట్ ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వకపోతే.. ఈనెల 20 నుంచి రామగుండం వేదికగా నిరవధిక దీక్ష చేపడతాం" అని స్పష్టం చేశారు.

## డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం మీడియా కృషి చేయాలి

డ్రగ్స్ నిర్మూలనను ప్రజా ఉద్యమంగా మార్చడంలో మీడియా కీలక భాగస్వామిగా ఉండాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో నిరంతర అవగాహన కల్పించడంలో మీడియా ముందుండాలని పేర్కొన్నారు. ప్రతి ఇంటిని, ప్రతి గ్రామాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పుకొచ్చారు. గురువారం హనుమకొండలో గవర్నర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మీడియాతో మాట్లాడారు.

**మీడియా నిర్మాణాత్మక పాత్ర పోషించాలి..**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చివరి లబ్ధిదారుని వరకు చేరేలా మీడియా నిర్మాణాత్మక పాత్ర పోషించాలని గవర్నర్ సూచించారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజా చైతన్యానికి సంబంధించిన సానుకూల అంశాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా బాధ్యత ఎంతో కీలకమని చెప్పుకొచ్చారు. ప్రజల్లో బాధ్యత, సామాజిక చైతన్యం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన పెంచేందుకు మీడియా నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు.మత్తు రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మీడియా సంపూర్ణ సహకారం అందించాలని గవర్నర్ కోరారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో మీడియా ఒక శక్తివంతమైన వేదికగా నిలవాలని సూచించారు. ప్రభుత్వం, ప్రజలు, మీడియా సమష్టిగా కృషి చేసినప్పుడే డ్రగ్స్ రహిత భారత్ -- డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యం సాకారమవుతుందని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు.

## పోక్సో కేసులో బండి భగీరథ్‌కు హైకోర్టు బెయిల్

పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ. లక్ష పూచీకత్తుతో పాటు కోర్టు నిర్దేశించిన షరతుల మేరకు బెయిల్ మంజూరైంది. ఈ కేసు విచారణ ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండాలని హైకోర్టు స్పష్టం చేసింది.

## సింగరేణి బకాయిలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తాం

సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ గనిని సింగరేణికి కేటాయింపునకు కృషి చేశారని పేర్కొన్నారు. తాడిచర్ల గని కేటాయింపును సింగరేణి కార్మిక సంఘాలు స్వాగతిస్తూ ప్రధాని మోదీ, కిషన్ రెడ్డికి పాలాభిషేకాలు చేస్తున్నాయని తెలిపారు. కార్మికుల్లో వ్యక్తమవుతున్న ఆనందాన్ని, బీజేపీకి వస్తున్న ప్రజాదరణను కాంగ్రెస్ సహించకలేకపోతోందన్నారు. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై కూడా పాయల శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిపై రూ.32 వేల కోట్ల బకాయిలు మోపిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో రూ.22 వేల కోట్ల బకాయిలు పెట్టిందని అన్నారు. మొత్తం రూ.55 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులు ఈ రెండు పార్టీల నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయిలను ఎప్పుడు, ఎలా చెల్లిస్తుందో స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని తెలిపారు. సింగరేణిలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉందని, సంస్థ వ్యవహారాల్లో కేంద్రం మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తన 51 శాతం వాటా పేరుతో సింగరేణి నిధులను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. బంగారు గనిలాంటి సింగరేణిని చీకట్లోకి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసి కేంద్రం పూర్తి స్థాయిలో జోక్యం చేసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని పాయల్ శంకర్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

## గ్రామానికి పెద్ద... గౌరవానికి అనాథ!

తెలంగాణలో అత్యంత నిర్లక్ష్యానికి గురవుతున్న ప్రజాప్రతినిధి ఎవరు అంటే ఆ పెద్దమనిషి సర్పంచ్ మాత్రమే. ఒక గ్రామంలో జనన ధ్రువీకరణ నుంచి మరణ నమోదు వరకు; తాగునీటి సమస్య నుంచి పారిశుధ్యం వరకు; వీధి దీపాల నుంచి రోడ్ల నిర్మాణం వరకు; సంక్షేమ పథకాల అమలు నుంచి ప్రజల నిత్య సమస్యల పరిష్కారం వరకు ప్రతి విషయంలో ప్రజలు ఆశ్రయించేది సర్పంచ్‌నే. అంతేగానీ ఢిల్లీని కాదు, హైదరాబాద్‌ను కాదు. గ్రామ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య తొలి వారధి సర్పంచ్. కానీ ప్రజలకు అత్యంత చేరువలో ఉండే ఈ ప్రజాప్రతినిధికి దక్కేది అత్యల్ప గౌరవం, గుర్తింపు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ... వీరందరూ ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులే. అదే విధంగా సర్పంచ్ కూడా ప్రజల ప్రత్యక్ష ఓట్లతో ఎన్నికవుతాడు. ప్రజాస్వామ్యపరంగా అందరి చట్టబద్ధత ఒక్కటే. కానీ వేతనాలు, భత్యాలు, కార్యాలయ సదుపాయాలు, సిబ్బంది, వైద్య భద్రత, పదవీ విరమణ తర్వాత పెన్షన్ విషయంలో మాత్రం ఆకాశానికి భూమికి ఉన్నంత తేడా ఉంది. ఐదేళ్లు గ్రామ ప్రజలకు సేవ చేసిన సర్పంచ్... పదవీకాలం ముగిసిన వెంటనే సాధారణ పౌరుడిగా మిగిలిపోతాడు. ఇది ప్రజాస్వామ్య సమానత్వ సూత్రానికే విరుద్ధం. తెలంగాణలో ప్రస్తుతం సర్పంచ్‌కు నెలకు కేవలం రూ.6,500 గౌరవ వేతనం మాత్రమే ఉంది. రోజుకు లెక్కిస్తే రూ.220 కూడా కాదు. కోట్ల రూపాయల అభివృద్ధి పనులను పర్యవేక్షించే, ప్రభుత్వ పథకాల అమలుకు బాధ్యత వహించే ప్రజాప్రతినిధి శ్రమను ఇంత తక్కువ మొత్తంతో కొలవడం గ్రామ పాలన పట్ల ప్రభుత్వ దృక్పథాన్నే ప్రశ్నిస్తున్నది. గోవాలో నెలకు దాదాపు రూ.20 వేల వరకు గౌరవ వేతనం అందుతోంది. కేరళలో రూ.15 వేలు, పంజాబ్‌లో రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు, హర్యానాలో రూ.10 వేలకు పైగా వేతనంతో పాటు ఇతర భత్యాలు కూడా ఇస్తున్నారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయడంలో ఈ రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. అందుకే గ్రామీణాభివృద్ధి సూచికల్లోనూ అవి మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయి. అయితే తెలంగాణ మాత్రం గ్రామ స్వరాజ్యాన్ని మాటల్లో మాత్రమే గొప్పగా చెబుతోంది. పజలకు సమాధానం చెప్పాల్సింది సర్పంచ్. కానీ నిధులు, పరిపాలనా అనుమతులు, సాంకేతిక ఆమోదాలు, ఆర్థిక స్వేచ్ఛ మాత్రం అధికారుల చేతుల్లోనే ఉంటున్నాయి. ఫలితంగా బాధ్యతలు సర్పంచ్‌పై, అధికారాలు మరెవరి చేతుల్లోనో అనే పరిస్థితి ఏర్పడింది. ఇది స్థానిక స్వపరిపాలన భావనను నిర్వీర్యం చేస్తోంది. తెలంగాణలో వేలాది మంది మహిళా సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్నారు. అయినా వారికి తగిన గౌరవం, భద్రత, ఆర్థిక స్వావలంబన లేదు. గ్రామ నాయకత్వాన్ని బలహీనపరిస్తే గ్రామ ప్రజాస్వామ్యమే బలహీనపడుతుంది. ఇప్పుడు సంస్కరణలు అత్యవసరం. సర్పంచ్‌ల గౌరవ వేతనాన్ని కనీసం రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచాలి. పదవీకాలం పూర్తి చేసిన వారికి గౌరవప్రదమైన పెన్షన్ అమలు చేయాలి. ఆరోగ్య బీమా, ప్రమాద బీమా కల్పించాలి. పంచాయతీలకు రాజ్యాంగం కల్పించిన ఆర్థిక, పరిపాలనా అధికారాలను పూర్తిస్థాయిలో బదిలీ చేయాలి. డిజిటల్ పాలన, ఆర్థిక నిర్వహణ, చట్టపరమైన అంశాలపై నిరంతర శిక్షణ అందించాలి. గ్రామ పంచాయతీలను కేవలం పథకాల అమలు కేంద్రాలుగా కాకుండా స్థానిక స్వపరిపాలన సంస్థలుగా బలోపేతం చేయాలి. గ్రామ స్వరాజ్యం బలపడాలంటే సర్పంచ్ బలపడాలి. సర్పంచ్ బలపడాలంటే గౌరవం, అధికారాలు, ఆర్థిక భద్రత కల్పించాలి. గ్రామాన్ని గౌరవించే ప్రభుత్వమే నిజమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం.

## అవే రోడ్లు.. అవే ప్రమాదాలు!

మన దేశంలో రోడ్లే కల్యాణ మండపాలు, రోడ్లే ఆట స్థలాలు, రోడ్లే పబ్లిక్ పాయిఖానాలు, ఆ దారిలో ఇళ్లున్న వారందరికీ రోడ్లే స్టోర్ రూములు, కిళ్లీ కొట్ల నుంచి కిరాణా కొట్ల వరకు రోడ్లే అన్ని వ్యాపారాలకు ఆవాసాలు. మరి ఇలాంటి దేశంలో సంవత్సరానికి నాలుగు లక్షల యాభై వేల రోడ్డు ప్రమాదాలు జరగటంలో వింతేమీ లేదు. మన దేశంలో ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు రోడ్డు ప్రమాదాల విషయంలో సంఖ్య రీత్యా మొదటి, రెండో స్థానాల్లో ఉన్నాయి. అలాగని తెలుగు రాష్ట్రాల పరిస్థితి మెరుగ్గా ఏమీ లేదు. 2014--24 సంవత్సరాల మధ్య పదేళ్లలో తెలంగాణలో 2,49,778 ప్రమాదాలు జరగ్గా 86,305 మంది ప్రాణాలు కోల్పోయి, 2,46,174 మంది గాయపడ్డారు. ఇదే కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 2,43,015 ప్రమాదాల్లో 85,353 మంది మరణించగా, 2,57,023 మంది గాయపడ్డారు. మన దేశపు నగరాల్లో 2024లో ఢిల్లీ 5,573 ప్రమాదాలతో మొదటి స్థానంలో ఉండగా, 3,785 ప్రమాదాలతో మన హైదరాబాద్ మూడో స్థానంలో ఉంది. రాజస్థాన్ (ఢిపల్లో) హైవే, బీజాపూర్--హైదరాబాద్ హైవేలపై జరిగిన తీవ్ర ప్రమాదాల సందర్భంగా గత సంవత్సరం జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ వినయ్ బిష్ణోయ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సుమోటోగా విచారణ చేపట్టి, భారీగా టోల్ ఫీజులు వసూలు చేస్తూ కూడా ఆ హైవేలను సరిగా అభివృద్ధి చేయటం లేదన్న కారణంగా ఆ రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. ఇంటి మొత్తానికి ఆధారమైన వ్యక్తి వాహన ప్రమాదంలో మరణిస్తేనో, లేక లేక పుట్టి చేతికి అందివచ్చే సమయంలో కొడుకు చనిపోతేనో ఆ కుటుంబం పడే వేదనా, తలకిందులయ్యే ఆశలూ వర్ణనాతీతం! ఈ ప్రమాదాల్లో గాయాలపాలై సుదీర్ఘకాలం ఆసుపత్రుల్లో ఉండాల్సి వస్తే ఆ పేద మధ్యతరగతి కుటుంబాలు ఆస్తులన్నీ అమ్ముకోవాల్సిందే! సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, పిల్లలు విదేశాల్లో ఉండటం, ఉద్యోగుల జీతాలు అకస్మాత్తుగా ఆరంకెల్లోకి పోవటం, పెన్షన్లు కూడా అదే స్థాయిల్లో వుండటం, వస్తు వ్యామోహం... తదితర కారణాల వల్ల మోటారు వాహనాల సంఖ్య జనాభాతో సమానంగా పెరుగుతున్నది. కానీ మరోపక్క వాహనాల నిర్మాణ, భద్రతా ప్రమాణాలన్నీ అవినీతి గాలిలో కొట్టుకుపోతున్నాయి. వాహనాలు నడిపేవారు మద్యం మత్తులో ఉండటం వల్ల, నిద్రలేమి వల్ల, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వాడటం వల్ల, రోడ్డు భద్రతపై ప్రభుత్వాలు తగినంత శ్రద్ధ చూపకపోవటం వల్ల... ఈ ప్రమాదాలు ఒక నిరంతర జాడ్యంగా ఉంటున్నాయి. ఎవరి ఇష్టానికి వారు మామూలు బస్సులను స్లీపర్లుగా మార్చుకుని తిప్పుతున్నా కిమ్మనకుండా చోద్యం చూస్తున్న రవాణాశాఖ కారణంగా ఇటీవల స్లీపరు బస్సు దహనాలు ఎక్కువవ్వటం చూస్తూనే ఉన్నాం. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాల నుంచి పిల్లలు వీకెండ్‌లో వస్తున్నారంటే శుక్రవారం రాత్రి తల్లిదండ్రులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు!

# ప్రతిపక్షాలకు ప్రజాస్వామ్య పాఠాలు









న్యాయవిరుద్ధంగా జరుగుతోన్న ప్రజాస్వామిక ఎన్నికలను ఎందుకు బహిష్కరించకూడదు? ఈ ప్రశ్న గుసగుసలుగా వినిపిస్తోంది. దీనిపై బహిరంగ చర్చ జరగాలి. ఆ చర్చ 'ఎన్నికలతో ఎందుకు ఇబ్బంది పడాలి?' అన్న ప్రశ్నతో ఆరంభమవ్వాలి. తులనాత్మక రాజకీయాలపై మౌలిక కృషికి ప్రసిద్ధుడైన పోలిష్--అమెరికన్ రాజనీతి శాస్త్రవేత్త ఆడమ్ ప్రెవోర్స్కి ప్రజాస్వామిక ఎన్నికలను గట్టిగా సమర్థించారు. ప్రజాస్వామ్యానికి ఆయన ఇచ్చిన నిర్వచనం సుప్రసిద్ధమయింది. 'ఎన్నికల ద్వారా ప్రభుత్వాలను ఎన్నుకోవడానికి, తొలగించడానికి వీలుండే ఒక వ్యవస్థ' అని ప్రజాస్వామ్యాన్ని ఆయన నిర్వచించారు. సుపరిపాలన, న్యాయబద్ధమైన ప్రజా ప్రాతినిధ్యం, సామాజిక సామరస్యం ప్రజాస్వామ్యంతోనే సమకూరుతాయని మనం స్వతస్సిద్ధంగా విశ్వసిస్తాం. అయితే పోటీదాయక ఎన్నికలు ఈ గుణాత్మక పరిస్థితులకు దోహదం చేయకపోవచ్చని ప్రెవోర్స్కి అంటారు. అయినప్పటికీ ఓటర్లను, నాయకులను, రాజకీయ పార్టీలను చికాకుపరిచే, ఇబ్బంది పెట్టే ప్రజాస్వామిక ఎన్నికలు విధిగా జరగాలని, అనేకానేక విభజనలు, అసమానతలతో సతమతమవుతున్న సమాజాలు అంతర్యుద్ధం దురవస్థల పాలవకుండా సామరస్య పూర్వకంగా మనుగడ సాధించేందుకు అవి విశేషంగా తోడ్పడుతాయని ఆయన నొక్కి చెప్పారు. అధికారంలో ఉన్నవారు పదవీ వైభవాన్ని కోల్పోయేందుకు అంగీకరిస్తారు, ఎన్నికలలో ఓడిపోయినవారు పరాజయాన్ని ఆమోదిస్తారు, అధికార మార్పిడి ఎన్నికల ద్వారా శాంతియుతంగా జరగడమే అందుకు కారణమని ప్రెవోర్స్కి అన్నారు. 1977 చరిత్రాత్మక లోక్‌సభ ఎన్నికలలో సంభవించిన మార్పే అందుకు నిదర్శనం. ఎన్నికల సమగ్రత (ఎలక్టోరల్ ఇంటిగ్రిటీ) ఒక పరిమితికి మించి పతనం కానప్పుడే అధికార బదిలీ శాంతియుతంగా జరిగేందుకు ఆస్కారమున్నది. అయితే ఎన్నికల సమగ్రతను నిష్పాక్షికంగా నిర్ణయించే ప్రమాణాలు ఏమిటి? ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన 11 అంశాలపై పిప్పానోరిస్, రిచర్డ్ ఫ్రాంక్ ఫెర్రాన్ మార్టినెజ్ కోమా అనే రాజనీతి శాస్త్రవేత్తల విశ్లేషణ ఎన్నికల సమగ్రతను నిర్ధారించేందుకు తోడ్పడుతుంది. వాటిలో ఒకటి ప్రచార నిధులు. ఈ అంశం మన ఎన్నికలను ఎంతగా ప్రభావితం చేస్తుందో మరి చెప్పనవసరం లేదు. నిధుల లభ్యత విషయంలో పాలక ప్రతిపక్షాల మధ్య అసమానతలు ఎన్నికల సమగ్రతకు చేటు చేస్తున్నాయి. 2014 అనంతరం మరో మూడు అంశాల-- తటస్థ ఎన్నికల అధికారులు, పారదర్శక ఎన్నికల నిర్వహణ పద్ధతులు, మీడియా కవరేజ్-- లో మన ఎన్నికల సమగ్రత క్రమంగా ఆమోదయోగ్య స్థాయి నుంచి బాగా దిగజారిపోతోంది. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ, డీలిమిటేషన్‌తో పాటు ప్రతిపక్షాలను నిలువునా చీల్చివేయడం మొదలైన చర్యలతో మన ఎన్నికల సమగ్రత మరింతగా భ్రష్టమవుతోంది. కోట్లాది వయోజనులకు ఓటు హక్కును నిరాకరించడం, పాలకపక్షం ప్రయోజనాలకు అనుగుణంగా నియోజకవర్గాల సరిహద్దులను మార్చివేయడం ఎన్నికల సమగ్రతకు ఎలా తోడ్పడుతాయి? భారత ప్రజాస్వామ్య ఎన్నికలు ఒకప్పుడు ఈ పురానవ భూమికి గర్వకారణంగా ఉండేవి. ఇరుగుపొరుగు దేశాలకు అసూయ పుట్టించేవి. సుదూర ప్రజాస్వామిక దేశాలకు అబ్బురం కలిగించేవి. అదంతా పాతకథ. ఇప్పుడు మన ఎన్నికల సమగ్రత కనీస ఆమోదయోగ్య స్థాయి నుంచి బాగా కిందకు జారిపోయింది. నిక్కచ్చిగా చెప్పాలంటే అధికారపక్షం తాను ఎన్నికలలో గెలిచితీరాలనుకుంటే గెలిచి తీరుతుంది. అలా గెలిచేందుకు అవసరమైన పరిస్థితులను సృష్టించుకోగలదు. ఈ కారణంగానే ప్రతిపక్ష నాయకులు మనుగడ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. తుది ఫలితం ముందుగానే నిర్ణయించబడిన ప్రజాస్వామిక పోటీలో వారు పాల్గొని తీరవల్సిందేనా? ఇదొక మంచి ప్రశ్న. ప్రజాస్వామిక పోటీ నుంచి పూర్తిగా ఉపసంహరించుకోవడం, పూర్తిస్థాయిలో ఎన్నికలను బహిష్కరించడం ఆ ప్రశ్నకు సరైన సమాధానం కాదు, కాబోదు. అటువంటి ప్రతిపాదనను మన ప్రతిపక్షాలు తిరస్కరించాలి. అందుకు మూడు సహేతుకమైన కారణాలు ఉన్నాయి. మొదటిది ఒక నైతిక వాదన. పాలకపక్షం మోసపూరితంగా ఫలితాలను తనకు అనుకూలంగా మార్చుకుంటున్నప్పటికీ ప్రతి ఎన్నికలలోనూ పోటీ చేసి తీరాలన్న సరళమైన ప్రజాస్వామిక తర్కంకాదిది. ఎన్నికల ప్రచార నైతికతకు ప్రాధాన్యమిచ్చే వాదన అది. పార్టీల పరస్పర విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండడం, వ్యక్తిగత దూషణలకు పాల్పడకపోవడం, సమాజంలో శాంతి సామరస్యాలను కాపాడడం మొదలైనవి ఎన్నికల ప్రచారంలో విధిగా అనుసరించాల్సిన కనీస నియమాలు. ప్రజాస్వామిక నిబద్ధత ఆ నైతిక పద్ధతులను అనుసరించాల్సిన ఆవశ్యకతను నిర్దేశిస్తుంది. ఎన్నికల ఫలితాలను తారుమారు చేస్తున్నారని ప్రతిపక్షాలు విశ్వసిస్తుంటే ఆ వాస్తవాన్ని ప్రజలూ పూర్తిగా నమ్మేలా చేయడం వాటి విధ్యుక్త ధర్మం. గత సార్వత్రక ఎన్నికలలోను, ఆ తరువాత వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలోను 'ఓట్ చోరీ' జరిగిందని కాంగ్రెస్ పార్టీ నెత్తీ నోరు కొట్టుకుని ఆందోళన చేస్తోంది. కాంగ్రెస్ వాదనలపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అంతమాత్రాన సామాన్య ఓటర్లు ఆ 'ఓట్ చోరీ' అభియోగాన్ని ఆమోదిస్తున్నారనే నిర్ణయానికి రావడం తొందరపాటే అవుతుంది. ఎటూ పాలకులకే అనుకూలంగా వ్యవహరించే జన మాధ్యమాల తీరుతెన్నుల మూలంగా ఎన్నికలలో చోటు చేసుకుంటున్న అక్రమాలపై ప్రజల అవగాహన అరకొరగా మాత్రమే ఉంటోంది. ఈ పరిస్థితి నిరుత్సాహం కలిగిస్తున్నప్పటికీ ఓటర్లు స్వయంగా ఎన్నికల్లో నిష్పాక్షికత, పారదర్శకతను డిమాండ్ చేసే పరిణత స్థాయికి ప్రజాభిప్రాయాన్ని నిర్మించడం ప్రతిపక్షాల బాధ్యత. విపక్షాలకు ప్రజాస్వామిక నైతికత నిర్దేశిస్తున్న కర్తవ్యమది. రెండో వాదన వ్యూహాత్మకమైనది.. ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులు న్యాయవిరుద్ధంగా ఉన్నప్పటికీ ఆ ప్రజాస్వామిక ప్రక్రియలో పాల్గొనడమే వివేకవంతమవుతుంది. ఎన్నికలను బహిష్కరించడం బాధ్యతాయుతమైన చర్య కాబోదు. ప్రపంచ దేశాల అనుభవం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఎన్నికల బహిష్కరణ అనేది పోలింగ్‌లో పాల్గొనే ఓటర్ల సంఖ్యను అత్యధిక స్థాయిలో తగ్గించి తీరాలి. లేని పక్షంలో నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ఉద్దేశించిన బహిష్కరణ వ్యూహం నిష్ఫలమవుతుంది. అంతేకాదు, ప్రజలు తమను ఆమోదించరనే భయ సంకోచాలతోనే ప్రతిపక్షాలు ఎన్నికలలో పాల్గొనడం లేదని పాలకులు ఆరోపించేందుకు ఆ వ్యర్థ వ్యూహం ఆస్కారమిస్తుంది. చెప్పవచ్చినదేమిటంటే ఎన్నికలలో పాల్గొనడమనేది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు అనేక అవకాశాలను కల్పిస్తుంది. విపక్షాలు ఎట్టి పరిస్థితులలోను వాటిని జారవిడుచుకోకూడదు. తమ పాలన చట్టబద్ధమైనదని ప్రపంచానికి చెప్పుకోవడానికై నిరంకుశ పాలకులు ప్రతిపక్షాల పట్ల ఔదార్యం చూపడం కద్దు. ఎన్నికలలో పాల్గొనేలా విపక్షాలను పురిగొల్పుతారు, చెప్పుకోదగ్గ విజయాలు వాటికి లభించేట్టు కూడా జాగ్రత్త వహిస్తారు! ఫలితాలు ఎలా వచ్చినప్పటికీ ఎన్నికలలో పాల్గొనడమనేది కార్యకర్తలను సమీకరించేందుకు, నిధులు సమకూర్చుకునేందుకు, పార్టీని కాపాడుకుని, మద్దతుదారుల నుంచి భావి నాయకులను రూపొందించేందుకు విపక్షాలకు విశేషంగా తోడ్పడుతుంది. విపక్షాలు ఎన్నికలలో పాల్గొనడం ద్వారా ఎన్నికల అక్రమాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించి వారిలో ప్రజాస్వామిక చైతన్యాన్ని పెంపొందించే అవకాశం విపక్షాలకు లభిస్తుంది. స్వేచ్ఛగా సక్రమంగా జరగవనే కారణంతో ఎన్నికలలో పాల్గొనకపోవడమనేది వివేకవంతమైన చర్య కాదు, కాబోదు. చాలా కాలంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, తూర్పు యూరోపియన్ దేశాలకు మన ప్రజాస్వామ్యాన్ని ఒక ఆదర్శ నమూనాగా చూపుతున్నాం. అయితే వాటి నుంచి మనమూ విజ్ఞతాయుతమైన ప్రజాస్వామిక పాఠాలు నేర్చుకోవల్సిన సమయమాసన్నమయింది. న్యాయవిరుద్ధ ఎన్నికలలో ఎందుకు పోటీ చేయాలో అలీనా బటూరా (2020లో బెలారస్ అధ్యక్ష ఎన్నికలను అధ్యయనం చేసిన మానవ హక్కుల పరిశోధకురాలు) స్పష్టంగా చెప్పారు. ఎన్నికలలో పాల్గొన్న బెలారస్ ప్రతిపక్షాలు తమ నిరంకుశ పాలకుడిని అధికారం నుంచి తొలగించలేకపోయినప్పటికీ ఎన్నికలలో ప్రభుత్వం పాల్పడిన అక్రమాలపై ప్రజలకు అవగాహన కలిగించాయి. దేశ పౌరులలో ప్రజాస్వామిక చైతన్యాన్ని పెంపొందించాయి. మరీ ముఖ్యంగా స్వదేశంలోనూ అంతర్జాతీయ సమాజంలోనూ తమ పాలకుడి చట్టబద్ధతను ప్రశ్నార్థకం చేశాయి.. ఎన్నికల వంటి ప్రజాస్వామిక ప్రక్రియలో అన్యాయం ఎంత ఎక్కువగా ఉందనే దానికంటే ఆ అన్యాయాన్ని అందరికీ తెలిసేలా బహిర్గతం చేసేందుకు అవకాశం ఉన్నదా లేదా అనేది చూడడం ముఖ్యం. ఎన్నికల బహిష్కరణ విషయమై నిర్ణయం తీసుకోవడంలో మన ప్రతిపక్షాలు ఈ వాస్తవాన్ని విస్మరించకూడదు. ఇక చివరగా ఒక చారిత్రక వాదనను కూడా మనం పరిగణనలోకి తీసుకోవాలి. అడ్డూ అదుపూ లేని నియంతలు సైతం తమ పాలనను ప్రజలు అంగీకరిస్తున్నారని చెప్పుకునేందుకు శతథా ప్రయత్నిస్తారు. ప్రజా ఉద్యమాల ఉధృతి నుంచి తమను తాము కాపాడుకోవడమనేది నియంతృత్వ పాలకులకు మరీ ముఖ్యం. ఇది 21వ శతాబ్దం కదా. ప్రజాస్వామ్యం గురించి మొక్కుబడి మాటలు ఇంకెంత మాత్రం సరిపోవు. ప్రదర్శనాత్మక ప్రజాస్వామ్యాన్ని ప్రజలు ఇంకెంత మాత్రం విశ్వసించరు. ఇప్పుడు మన దేశంలో ఎన్నికల సమగ్రత మున్నెన్నడూ లేనంతగా తక్కువ స్థాయిలో ఉన్నది. ఈ శోచనీయ పరిస్థితి వల్ల, పాలకుల అధికార భద్రతకు ముప్పు వాటిల్లదు. అయితే సమీప భవిష్యత్తులోనే అగ్నిపర్వతంలా బద్ధలయ్యే ప్రజాగ్రహం నుంచి పాలకులను అది కాపాడలేదు. ఇది తథ్యం. ఇటీవల హంగరీ ఎన్నికలలో జరిగింది ఇదే కాదూ?. 1977లో ఇందిరాగాంధీ అనూహ్య అపజయం చాటిన సత్యం కూడా అదే కదా. ఈ క్షణాన అసంభవంగా కనిపిస్తున్న ఈ తిరుగులేని వాస్తవం మన ప్రస్తుత పాలకుల విషయంలోనూ సంభవించే అవకాశాన్ని కొట్టివేయలేము.

## భారీ జోష్‌తో ఐడిపీఎల్‌లో విద్యార్థులతో జాతీయ విద్యార్థి దినోత్సవం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్

( జూలై - 9- హంస కలంవార్త )



అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా చింతల్‌లో భారీ ర్యాలీ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఔిూ జాతీయ కన్వీనర్ నికిత మరియు కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ రేగోడ్ నాగేష్ గారు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కన్వీనర్ మృత్యుంజయ్, మౌనిక, తరంగిణి, ఆశిష్, వివేక్‌తో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం అందరూ ఒకరికి ఒకరు జాతీయ విద్యార్థి దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## విపత్తుల సమయంలో ఎస్డీఆర్ఎఫ్ కీలకం

-ఎప్పుడైనా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలి

-జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్

( జూలై - 9- హంస కలంవార్త )



విపత్తుల సమయంలో స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్ డీ ఆర్ ఎఫ్) అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ తెలిపారు.సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్ లోని 17 వ బెటాలియన్ లో స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్ డీ ఆర్ ఎఫ్) ఆద్వర్యంలో విపత్తులు,వరదలు వచ్చే సమయంలో ఉపయోగించే యంత్రాలు,పరికరాల ప్రదర్శన గురువారం నిర్వహించగా,జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్,ఎస్పీ మహేష్ బి గితే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బాధితులను గుర్తించే కెమెరా,రిమోట్ కంట్రోల్ లైఫ్ బోయ్ (ప్రాణరక్షక తేలియాడే పరికరం),తనిఖీ రంధ్రం చేసే పరికరం,ఎత్తైన వెలుతురు స్తంభం (లైట్ మాస్ట్),రక్షణ కార్యక్రమాల కోసం ఉపయోగించే రోటరీ కట్టింగ్ యంత్రం,గాలి ద్వారా బరువులను ఎత్తే లిఫ్టింగ్ బ్యాగ్,పీవీసీ రక్షణ దుస్తులు,హైడ్రాలిక్ స్ప్రెడర్ కట్టర్ (లోహాన్ని విప్పే,కత్తిరించే పరికరం) ప్రదర్శన లో పెట్టగా,జిల్లా కలెక్టర్,ఎస్పీ,అధికారులతో కలిసి పరిశీలించారు.ఒక్కో యంత్రం పనితీరు,వాటిని ఉపయోగించే విధానాన్ని వివరించారు.గత ఏడాది వరదలు వచ్చినప్పుడు కామారెడ్డి,వరంగల్ ఇతర ప్రాంతాల్లో ఎస్ డీ ఆర్ ఎఫ్ టీమ్ అందించిన సేవల వీడియోలను ప్రదర్శించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు రిజర్వాయర్లు ఎగువ మానేరు,మధ్య మానేరు,అన్నపూర్ణ,మల్కపేట ఉన్నాయని తెలిపారు.వర్షాకాలంతో పాటు సెప్టెంబర్,అక్టోబర్ నెలలో భారీ వరదలు వచ్చే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు.ఎస్ డీ ఆర్ ఎఫ్ బృందం శిక్షణ లో నేర్చుకున్న అంశాలు విపత్తులు సంభ వించినప్పుడు తక్షణమే వినియోగించాల్సి వస్తుందని తెలిపారు.అప్పుడు ప్రతి నిమిషం విలువైందని స్పష్టం చేశారు.రెవెన్యూ,పోలీస్,ఫైర్,ఎస్డీఆర్ఎఫ్ అధికారులు ఒక టీమ్ గా సమాచారం చేరవేస్తూ వరదలు వచ్చినప్పుడు సమన్వయంతో సేవలు అందించాలని ఆదేశించారు.గత ఏడాది వరదలు వచ్చినప్పుడు వివిధ జిల్లాల్లో ఉత్తమ సేవలు అందించిన ఎస్డీఆర్ఎఫ్ బృందం,ఇతర అధికారులను అభినందించారు.ఎప్పుడైనా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు.ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ వర్షాలు వస్తే సేవలు అందించేందుకు ఎప్పుడైనా సిద్ధంగా ఉండాలని సూచించారు.గత ఏడాది వరదలు సంభవించి ఇబ్బంది పడిన చోట్ల అధికారులు పరిశీలించి ఇంకా కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.విపత్తులు సంభవించినప్పుడు వాడే పరికరాలు,యంత్రాలతో మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు.ఇంకా ఏమైనా యంత్రాలు,పరికరాలు కావాల్సి ఉంటే ముందస్తుగా తెప్పించాలని సూచించారు.ఉత్తమ సేవలు అందిస్తున్న అధికారులు,సిబ్బందిని అభినందించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్,కమాండెంట్ పీ జె.పి.సి.ఛటర్జీ,అడిషనల్ కమాండెంట్ ఎంఐ సురేష్,అసిస్టెంట్ కమాండెంట్ సురేష్,ఎస్డీఆర్ఎఫ్ ఆర్ఐ బండి శ్రీనివాస్,తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాలేరు దివ్య క్షేత్రాలలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనలు..

-ఈశ్వరమాధారం... హస్నాబాద్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన..

-మంత్రి పొంగులేటి సతీమణి శ్రీమతి పొంగులేటి మాధురి

( జూలై - 9- హంస కలంవార్త )



పాలేరు : పాలేరు నియోజకవర్గ పరిధిలో గురువారం ఆధ్యాత్మిక సౌరభం వెల్లివిరిసింది. కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో అత్యంత వైభవంగా నిర్వహించిన నూతన ఆలయాల విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సతీమణి శ్రీమతి పొంగులేటి మాధురి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

-శాస్త్రోక్తంగా మాధారేశ్వరుని ప్రతిష్ఠ...

కూసుమంచి మండలం ఈశ్వరమాధారంలో శ్రీ పార్వతీ సమేత ఈశ్వర మాధారేశ్వర స్వామి వారి శివలింగ, ధ్వజస్తంభ, చండీశ్వర ప్రతిష్ఠాపనలు శాస్త్రోక్తంగా సంపన్నమయ్యాయి. వీటితో పాటు నవగ్రహ, నాగేంద్రస్వామి, గ్రామ దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. మూడవ రోజు వేడుకల్లో భాగంగా జరిగిన వేదమంత్ర హోమాలు, స్థిర యంత్ర స్థాపన, మహా పూర్ణాహుతి క్రతువుల్లో పాల్గొన్న పొంగులేటి మాధురికి అర్చకులు స్వాగతం పలికి వేదాశీర్వచనం అందించారు. హస్నాబాద్‌లో సీతారాముల కలశ ప్రతిష్ఠ.. బచ్చోడులో దర్శనం... తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ సీతా సమేత శ్రీ రామాంజనేయ స్వామి వారి ఆలయ ధ్వజస్తంభ, శిఖర కలశ ప్రతిష్ఠాపన ముగింపు వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ పర్యటనలో భాగంగానే బచ్చోడు గ్రామంలోని మహిమాన్విత శ్రీ రామాలయాన్ని కూడా ఆమె సందర్శించి తారకరాముని దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకున్నారు. నూతన వధూవరులకు ఆశీస్సులు... అదేవిధంగా పాలేరు గ్రామంలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని పొంగులేటి మాధురి నూతన వధూవరులను ఆశీర్వదించారు. పట్టు వస్త్రాలను కానుకగా బహూకరించారు.

# భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

-రైతులకు భరోసా,పోడు, వ్యవసాయ భూ సమస్యల పరిష్కారానికి కృషి

-అన్ని శాఖలు సమన్వయంతో వేగవంతమైన చర్యలు

-సోమశిలలో రైతుల సమక్షంలో మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష

-రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు

-నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించండి

-అధికారులకు మంత్రి స్పష్టమైన ఆదేశాలు

-భూములను సర్వే చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేస్తాం

-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



( జూలై - 9- హంస కలంవార్త )

నియోజకవర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాలకు చెందిన రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న పోడు భూములు, వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. రైతుల సమస్యలను కార్యాలయాల్లో కాకుండా క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలనే లక్ష్యంతో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం సోమశిలలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్‌తో కలిసి ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులతో సుదీర్ఘంగా చర్చిస్తూ సమస్యల పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను అడిగి మంత్రి జూపల్లి కృష్ణారావు తెలుసుకున్నారు. రైతుల సమక్షంలోనే ఒక్కో సమస్యను పరిశీలిస్తూ అక్కడికక్కడే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సమీక్ష సమావేశానికి జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో రైతులకు తమ భూ సమస్యలను నేరుగా వివరించే అవకాశం కల్పించడం సమావేశానికి ప్రత్యేకతగా నిలిచింది. ఒక్కో గ్రామానికి చెందిన రైతులను విడివిడిగా పిలిపించి వారి సమస్యలను మంత్రి స్వయంగా ఆలకించారు. ప్రతి కేసు ప్రస్తుతం ఏ దశలో ఉందో, రెవెన్యూ శాఖ వద్ద పెండింగ్‌లో ఉందా, అటవీ శాఖ పరిధిలో ఉందా, సర్వే పూర్తికాక నిలిచిపోయిందా, లేక రికార్డుల్లో వ్యత్యాసాల కారణంగా నిలిచిందా అనే అంశాలను అధికారులను ప్రశ్నిస్తూ సమగ్రంగా సమీక్షించారు. కొన్ని గ్రామాల్లో అటవీ శాఖ అభ్యంతరాల కారణంగా, మరికొన్ని చోట్ల రెవెన్యూ రికార్డుల్లోని లోపాల వల్ల, ఇంకొన్ని ప్రాంతాల్లో సర్వే నంబర్ల వివాదాల కారణంగా రైతులు దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములకు హక్కులు పొందలేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన మంత్రి, సంబంధిత అధికారులను అక్కడికక్కడే వివరణ కోరుతూ సమస్యల మూలాలను గుర్తించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ...., రైతుల భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భూమి రైతుకు జీవనాధారం అని, అలాంటి భూములకు సంబంధించిన వివాదాలు ఏళ్ల తరబడి కొనసాగడం వల్ల రైతులు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందుకే రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులు నేరుగా గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి పరిష్కరించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏళ్ల తరబడి భూ సమస్యలు పెండింగ్‌లో ఉండటం ఏమిటి? రైతులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోంది? అంటూ మంత్రి అధికారులను ప్రశ్నించారు. రైతులు దరఖాస్తు చేసిన తర్వాత నెలలు, సంవత్సరాల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండకూడదని, ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ప్రభుత్వం ఏమాత్రం సహించబోదని మంత్రి హెచ్చరించారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల అనేక భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి తెలిపారు . ఇకపై రెండు శాఖలు పరస్పర సహకారంతో పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. వివాదాస్పద భూములపై సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించి, భూ రికార్డులు, అటవీ సరిహద్దులు, రైతుల ఆధీనంలో ఉన్న భూముల వివరాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. ఏ శాఖ పరిధిలో ఏ సమస్య ఉందో వెంటనే గుర్తించి పరస్పరం సమాచారాన్ని పంచుకోవాలని, ఫైళ్లను ఒక శాఖ నుంచి మరో శాఖకు పంపుతూ కాలయాపన చేయకుండా సమన్వయంతో నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోడు భూములు, పట్టాదారు పాస్‌బుక్ సమస్యలు, సర్వే నంబర్ల వివాదాలు, రికార్డుల్లోని తప్పులు, సరిహద్దు వివాదాలు, సాగులో ఉన్న భూములపై నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించిన మంత్రి, అర్హులైన రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చట్టబద్ధంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరిగితే రైతుల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం పడుతుందని, అధికారులు ప్రజల సమస్యలను కేవలం ఫైళ్లకే పరిమితం చేయకుండా బాధ్యత, జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి దరఖాస్తును మానవీయ కోణంలో పరిశీలించి అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో రైతులు లేవనెత్తిన ప్రతి సమస్యపై సంబంధిత అధికారులను ప్రశ్నించిన మంత్రి, అవసరమైన చోట అటవీ, రెవెన్యూ శాఖల సంయుక్త బృందాలతో క్షేత్రస్థాయి పరిశీలనలు చేపట్టి త్వరితగతిన నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. నివేదికల ఆధారంగా చట్టబద్ధంగా సమస్యలను పరిష్కరించి అర్హులైన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో, పారదర్శకంగా పనిచేయాలని, రైతులను ఇకపై కార్యాలయాల చుట్టూ తిప్పే పరిస్థితి రాకుండా చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు.

-జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ


ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., రైతుల భూ సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్‌లు, పాత పట్టాలు, సర్వే నంబర్లు, హద్దులు, సరిహద్దుల వివరాలు, అందుబాటులో ఉన్న ఇతర రికార్డులను సంబంధిత ఆర్డీవో కార్యాలయానికి అందించాలని సూచించారు. పూర్తి స్థాయి రికార్డులు అందుబాటులో ఉంటే సమస్యల పరిష్కారం మరింత వేగవంతం అవుతుందనితెలిపారు. రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి, భూమి వాస్తవ పరిస్థితి, భూ రికార్డులు, అటవీ సరిహద్దులు, రైతుల సాగు ఆధారాలను సమగ్రంగా పరిశీలిస్తారని చెప్పారు. సర్వేలో అర్హత ఉన్నట్లు నిర్ధారణ అయిన రైతుల భూములను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా భూ భారతి పోర్టల్‌లో నమోదు చేసి, వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పించే చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి కేసును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులు గ్రామాలకే వెళ్లి పరిశీలనలు నిర్వహించాలని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అర్హులైన ఒక్క రైతుకైనా అన్యాయం జరగకుండా చట్టబద్ధంగా, పారదర్శకంగా వ్యవహరిస్తూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో కట్టుబడి పనిచేస్తోందని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు

# భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

-రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్

( జూలై - 9- హంస కలంవార్త )

భూముల రీ సర్వేను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత పారదర్శకంగా నిర్వహించి ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. భూముల రీ సర్వే, నక్ష భూముల అంశాలపై రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగిత్యాల సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వేను దశలవారీగా చేపడుతోందని తెలిపారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సర్వేతో ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడంతో పాటు ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయించనున్నట్లు తెలిపారు. డీజీపీఎస్ , రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రీ సర్వే చేపట్టాలని ఆదేశించారు. రీ సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, ఆయా గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వాములను చేయాలని సూచించారు. రీ సర్వేలో రెగ్యులర్ సర్వేయర్లతో పాటు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సోమవారం నుంచి సర్వేయర్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా సమగ్ర శిక్షణ నిర్వహించి అనంతరం అన్ని గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమాలు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో కూడా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రీ సర్వే పూర్తయ్యే వరకు రెగ్యులర్ సర్వేయర్లలో 25 శాతం మందిని రొటేషన్ పద్ధతిలో విధుల్లో వినియోగించాలని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పనితీరును శాఖ సర్వేయర్లు నిరంతరం పర్యవేక్షించాలని, డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో రీ సర్వే పనులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. రీ సర్వేలో పాల్గొనే లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం అందజేస్తుందని తెలిపారు. భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో అసాధారణ జాప్యంపై ఉన్నత న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, సాధారణ విధులు నిర్వహించడానికి కోర్టు ఆదేశాలు అవసరమా అని హైకోర్టు ప్రశ్నించిందని తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రతి అధికారిని వివరణ కోరుతోందని, స్పందించేందుకు నాలుగు వారాల గడువు లభించిందన్నారు. రెవెన్యూ కార్యాలయం లోనూ భూ భారతి దరఖాస్తులు 60 రోజులకు మించి పెండింగ్‌లో ఉండకూడదని, పెండింగ్ దరఖాస్తులను అత్యంత త్వరగా పరిష్కరించాలని లోకేశ్ కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గత రెండు నెలలుగా భూ భారతి వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు, బఫరింగ్ సమస్యలు ఎదురవుతున్నాయని కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కరించిన అనేక దరఖాస్తులను కూడా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేని పరిస్థితి నెలకొందని, ఈ సాంకేతిక సమస్యలు పరిష్కారమైతే పెద్ద సంఖ్యలో పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించగలమని తెలిపారు. జిల్లాలో భూధార్ ప్రాజెక్టు కింద ఎంపికైన 70 గ్రామాల్లో ఇప్పటివరకు 5 గ్రామసభలు నిర్వహించామని, మరో 65 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రతి రోజు రెండు గ్రామసభలు నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఏడి (ల్యాండ్ సర్వే)కు ఆదేశాలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత, ఏడి (ల్యాండ్ సర్వే) కృష్ణ ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# గూడ్స్ షెడ్ ను జాతికి అంకితం చేసిన పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి

( జూలై - 9- హంస కలంవార్త )

నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి, తెలంగాణలోని జానకంపెట్ గూడ్స్ షెడ్‌ను జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ డి.ఎస్.రామారావు, దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి శ్రీధర్, హైదరాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అనిరుధ్ పమార్, హైదరాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ ఇంజనీర్ పి.టి.వి.దుర్గా ప్రసాద్ మరియు ఇతర సీనియర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు. ఎంపీ అర్వింద్ ధర్మపురి సభను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో రైలు వ్యవస్థ భారీ మౌలిక సదుపాయాల మరియు ప్రయాణికుల అనుకూల అభివృద్ధిని సాధించిందని పేర్కొన్నారు. 2014 సంవత్సరం నుండి రాష్ట్రానికి కేటాయించిన బడ్జెట్ కేటాయింపులు 20 రెట్లకు పైగా పెరిగి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2026-27) రూ.5,454 కోట్లకు చేరుకున్నాయని ఆయన తెలిపారు. గత 12 ఏళ్లలో 340 కిలోమీటర్ల మేర కొత్త రైలు మార్గం, అలాగే 562 కిలోమీటర్ల మేర డబుల్ లైన్, మూడవ మరియు నాల్గవ లైన్ల నిర్మాణం జరిగిందని, తెలంగాణలోని మొత్తం రైలు నెట్‌వర్క్ విద్యుదీకరణ (మనోహరాబాద్ -- సిద్దిపేట లైన్ మినహా) పూర్తయిందని ఆయన వెల్లడించారు. తెలంగాణలో ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ రైల్వే ప్రాజెక్టుల మొత్తం వ్యయం రూ. 42,000 కోట్లు అని ఆయన తెలిపారు. జానకంపెట్లో నూతనంగా ప్రారంభించబడిన గూడ్స్ షెడ్ ఈ ప్రాంతానికి ఒక ముఖ్యమైన మైలురాయి అని ఎంపీ అభిప్రాయపడ్డారు. ఈ గూడ్స్ షెడ్ దేశంలోని వివిధ ప్రాంతాలకు స్థానిక సరుకుల రవాణాను సులభతరం చేస్తుందని, రైతులు, వ్యాపారులు, వర్తకులు మరియు వ్యాపార వర్గాలకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ ప్రాంతంలో సరుకు రవాణా మరియు వస్తువుల నిర్వహణ సౌకర్యాలను మరింత విస్తరించడానికి జానకంపెట్ గూడ్స్ షెడ్ను రూ . 9 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారని ఎంపీ తెలిపారు. ప్రస్తుతం ఈ గూడ్స్ షెడ్లో ప్రధానంగా బియ్యం, మొక్కజొన్న, జొన్నలను లోడ్ చేస్తుండగా, ఎరువులు మరియు సిమెంట్ను అన్లోడ్ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ గూడ్స్ షెడ్‌లో సరుకు రవాణా రైళ్లు మరియు సరుకుల నిర్వహణ మరింత పెరిగే అవకాశం కూడా ఉందని ఆయన పేర్కొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రూ.58 కోట్ల వ్యయంతో నిజామాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి, కవచ్ రక్షణ వ్యవస్థ 4.0 అమలు, నిజామాబాద్ స్టేషన్లో యార్డ్ పునర్నిర్మాణ పనులు, నిజామాబాద్ నియోజకవర్గంలో మూడు రోడ్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం మొదలైన వాటితో సహా ఈ ప్రాంతంలో చేపట్టిన వివిధ రైల్వే అభివృద్ధి ప్రాజెక్టుల



గురించి వివరించారు. అంతకుముందు, అదనపు డీఆర్ఎం డి.ఎస్. రామారావు స్వాగతోపన్యాసం చేశారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రయాణీకుల సేవలు వంటి వివిధ అంశాలకు సహకారం అందించడం ద్వారా జోన్ అభివృద్ధి పథంలో హైదరాబాద్ డివిజన్ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. జానకంపెట్ గూడ్స్ షెడ్ జోన్ యొక్క సరుకు రవాణా పరిధిని మరింత మెరుగుపరుస్తుందని మరియు స్థానిక వ్యాపారులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన పేర్కొన్నారు. రోడ్డు వాహనాల సులభ రాకపోకల కోసం గూడ్స్ షెడ్‌ను విశాలమైన సర్క్యులేటింగ్ ఏరియాతో అభివృద్ధి చేశారని, అలాగే ప్రధాన రహదారికి సులభంగా చేరుకునేలా అనుసంధాన రహదారులను కూడా అభివృద్ధి చేశారని ఆయన తెలిపారు.

# రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

-తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు ఆశీర్వాద సభకు చింతకాని వేదిక..

-9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ..

-తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టి పెట్టాలి..

-150 స్టాల్స్ ఏర్పాటు అంచనాలకు మించి 11 వేల మంది రైతుల హాజరు..

-మెగా రైతు మేళాలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




( జూలై - 9- హంస కలంవార్త )

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. చింతకాని మండలం జగన్నాధపురం గ్రామంలో గురువారం నిర్వహించిన మెగా రైతు మేళాకు రైతులు విశేషంగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మంత్రివర్గం రైతుల అవసరాలు, వ్యవసాయ రంగ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందన్నారు. విత్తనం వేసినప్పటి నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి దశలో రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని, తమ ప్రభుత్వం మాటలకు పరిమితం కాకుండా చేతల్లో చూపించే ప్రభుత్వమని అన్నారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీరాం సాగర్, కడెం వంటి సాగునీటి ప్రాజెక్టులు నేటికీ రైతులకు నీరందిస్తున్నాయని, గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం కుంగిపోవడం ఆ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో ప్రతి కుటుంబానికి వ్యవసాయంతో అనుబంధం ఉందని, అందుకే ఇక్కడ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. ప్రభుత్వానికి అనేక సమస్యలు ఉన్నప్పటికీ ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేశామని తెలిపారు. వ్యవసాయ ఆధునికీకరణ కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని, ఖమ్మం నుంచి ఆదిలాబాద్ వరకు ప్రతి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును విస్తరిస్తున్నామని తెలిపారు. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రత్యామ్నాయ పంటలపై శాస్త్రవేత్తలతో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి సహా తెలంగాణ మంత్రివర్గం మొత్తం హాజరవుతుందని అన్నారు. ప్రస్తుతం రైతులకు అందుతున్న ప్రతి నీటి చుక్క కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ద్వారానే వస్తోందని తెలిపారు. రైతులను మాయమాటలతో మోసం చేసే పార్టీలకు ప్రజలు అవకాశం ఇవ్వబోరని అన్నారు. రైతు సంక్షేమానికి పునాదులు వేసిన ప్రభుత్వాలను రైతులే కాపాడుకుంటారని, ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్న అబద్ధాలను ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. చింతకాని మండలంలో మూడు లక్షల మంది రైతులతో భారీ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను రైతులకు అందించాలనే లక్ష్యంతో స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. రైతుల అభివృద్ధికి అవసరమైన ప్రతి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని, శాస్త్రవేత్తలు చెప్పే అంశాలను రైతులు శ్రద్ధగా విని గ్రామాలకు తీసుకెళ్లాలని కోరారు. ఆధునిక సాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయంతో పాటు ఫిషరీస్, హార్టికల్చర్ తదితర అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో జూన్ 30న నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభ వర్షాల కారణంగా జూలై 10వ తేదీకి వాయిదా పడిందన్నారు. తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు సభను చింతకాని మండలంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవడం లేదని, ఈ ఏడాది నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఎలా వ్యవసాయం చేయాలనే అంశాలపై వ్యవసాయ శాఖ శాస్త్రీయ సూచనలు అందిస్తోందన్నారు. ర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైరా ప్రాజెక్టుకు గోదావరి జలాలు అందించాలని చేసిన విజ్ఞప్తికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని వినియోగించుకుంటూ రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను వైరా ప్రాజెక్టుకు తరలిస్తున్నామని, దీంతో వర్షాలతో సంబంధం లేకుండా దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. తక్కువ కాలంలో, తక్కువ నీటితో పండే పంటలను రైతులు సాగు చేయాలని సూచించారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్నను కొనుగోలు చేయలేదని, రైతులు నష్టపోకుండా ఉండేందుకు డిప్యూటీ సీఎం రూ.5 వేల కోట్లు కేటాయించి మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేశారని తెలిపారు. మొక్కజొన్నతో పాటు జొన్న, సోయా తదితర పంటలను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. మొక్కజొన్న విక్రయించిన రైతుల ఖాతాల్లో మద్దతు ధర చెల్లింపులు రేపటిలోగా జమ చేస్తామని స్పష్టం చేశారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభ చారిత్రక ఘట్టమని, రైతులకు అవసరమైన ప్రతి సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు లక్షలాది మంది రైతులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమాలు, పోరాటాలు, వ్యవసాయ రంగంలో ఖమ్మం జిల్లాకు ఘన చరిత్ర ఉందని, జిల్లాలో అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందన్నారు. సంప్రదాయ పంటలతోపాటు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, అధిక ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ద్వారా వచ్చే వేతనం కంటే ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రకృతి సహకరించక పోయినా రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రైతులకు అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సమకూరుస్తున్నామని, యూరియా యాప్ ద్వారా అవసరమైన మేరకే కొనుగోలు చేయాలని సూచించారు. యూరియా యాప్ వల్ల దుర్వినియోగానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. రైతులకు వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని, మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రపంచంలో ఉన్న అత్యాధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మెగా రైతు మేళా, రైతు ఆశీర్వాద సభ నిర్వహణకు అద్భుతమైన ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం, అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు. వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను రైతులకు వివరించేందుకు ఈ మెగా రైతు మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదర్శ రైతులు అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలను ఇతర రైతులకు పరిచయం చేయడం కూడా ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. పంట మార్పిడి విధానం అమలు చేయడం, ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మెగా రైతు మేళా కోసం మొత్తం 150 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖతో పాటు హార్టికల్చర్, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మెగా రైతు మేళాకు 5 వేల మంది రైతులు వస్తారని అంచనా వేయగా దాదాపు 11 వేల మంది రైతులు హాజరయ్యారని తెలిపారు. రైతుల కోసం ఆధునిక వ్యవసాయ యంత్రాలు, సాంకేతిక పరికరాలను ప్రదర్శనకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు ఎలా సాధించాలి, ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగంలో ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాకు విచ్చేయనున్నారని, 'రైతు ఆశీర్వాదం' పేరుతో మూడు లక్షల మంది రైతులతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొంటూ, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ రాజ్యసభ ఫ్లోర్ లీడర్ గా వద్దిరాజు మాజీ ఎంపీ నామ శుభాకాంక్షలు

( జూలై - 9- హంస కలంవార్త )



రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గా నియమితులైన ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్ సభాపక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ తరపున తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర గొంతుకను సమర్థవంతంగా వినిపిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర హక్కులు, ప్రయోజనాల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. వద్దిరాజు రవిచంద్ర నాయకత్వంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ మరింత సమర్థవంతంగా పనిచేస్తూ తెలంగాణ ప్రయోజనాల సాధనలో ముందుండాలని ఆశిస్తూ మరోసారి శుభాకాంక్షలు తెలిపారు.

# గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్న కొత్తగూడెం 3 టౌన్ పోలీసులు

( జూలై - 9- హంస కలంవార్త )



ప్రజల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం, ముఖ్యంగా యువత గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా రక్షించడం లక్ష్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పి రోహిత్ రాజు ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారం మేరకు కొత్తగూడెం పట్టణంలోని మెదరబస్తీ ప్రాంతంలో కొత్తగూడెం 3 టౌన్ పోలీసులు బుధవారం సాయంత్రం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చట్టపరమైన ప్రక్రియలు చేపట్టారు. ఈ ఘటనపై క్రైమ్ నెం.ఇఇఇ/2026 కేసు నమోదు చేసినట్లు కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ వెలువరించరు. గంజాయి వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికి, కుటుంబానికి మరియు సమాజానికి తీవ్ర హానికరమని వారికి అవగాహన కల్పించి, భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వారిని గౌరవ న్యాయస్థానంలో హాజరుపరిచి డీ-అడిక్షన్ సెంటర్‌కు పంపించనున్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం డిఎస్పి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని, గంజాయి కొనుగోలు, విక్రయం, రవాణా, నిల్వ, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రజలు మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం అవసరం

-పోలీసుల ప్రతిభను వెలికితీసేందుకే పోలీస్ డ్యూటీ మీట్

( జూలై - 9- హంస కలంవార్త )




పోలీస్ విధినిర్వహణలో సామర్థ్యం పెంచడానికి తెలంగాణా రాష్ట్రంలో మూడవ పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహణలో భాగంగా శుక్రవారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేటులో కార్యాలయంలో జోన్ 2 బాసర లెవల్ పోలీస్ డ్యూటీ మీట్ - 2026 కార్యాక్రమం ( నిజామాబాద్, జగిత్యాల్, నిర్మల్, అదిలాబాద్ జిల్లాల ) పోలీస్ డిపార్ట్మెంట్ లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ద్వారా పోలీస్ విభాగంలో కానిస్టేబుల్ స్థాయి నుండి సి.ఐ స్థాయి వరకు పనిపద్దతులు మెరుగుపడి ఇన్వేస్టిగేషన్ స్థాయిలు పెరుగుతాయన్నారు , పనిలో పోటీతత్వం అలవాటుపడు తుందనీ. సైంటిఫిక్ ఇన్వేస్టిగేషన్ , ఫొరంసిక్ , ఫింగర్ ప్రింట్ ఇన్వేస్టిగేషన్ కోసం ఎంపికలో భాగంగా నిజామాబాద్ పోలీస్ కమీషనరేటులో నేరాలు జరిగినప్పుడు అట్టి నేరస్థలంలో సేకరించవలసిన నేర సమాచారం కోసం " పోలీస్ క్లూస్ " ఏ విధంగా సేకరించాల అనేదాని కోసం ఎంపిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా పోలీస్ హెడ్ క్వార్టర్ గ్రౌండ్ , పోలీస్ కమాండ్ కంట్రోల్ కార్యలయం , పోలీస్ కార్యాలయం లో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, సమక్షంలో సి.ఐలు , ఎస్.ఐలు మరియు సిబ్బందికి ఎంపిక పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఇందులో సైంటి ఫిక్ ఎయిడ్స్ టూ ఇన్వెస్టగేషన్, కంప్యూటర్స్ , డాగ్ స్క్వాడ్ , ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీ , ఎక్స్ ప్లోజింగ్ ,నార్కోటిక్, ఫింగర్ ప్రింట్స్ , ఫోరెన్సిక్ మెడిసిన్ , తదితర అంశాల కోసం ఎంపికలు నిర్వహించడం జరిగింది. ఈ ఎంపికలు రెండు రోజులపాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలను సైన్స్ ఇన్వెస్టిగేషన్ టూల్ గా మార్చుకోవడం కోసం తమను తాము మెరుగుపరుచుకుని ఉత్తమ ప్రతిభ కనబరచడం కోసం తద్వారా కన్వెన్షన్ పెంచడం కోసం ఈ పోటీలు ఉపయోగపడతాయని తెలిపారు.ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలోనూ రాణించి మంచి పేరు తీసుకురావాలని పోలీస్ కమీషనర్ ఆకాంక్షించారు

# బిజినెస్

## చమురు షాక్ ప్రభావం స్వల్పమే.. భారత ఆర్థిక వ్యవస్థపై ఐఎంఎఫ్ ధీమా




పశ్చిమాసియా ఘర్షణల కారణంగా అంతర్జాతీయ చమురు ధరలు పెరిగినా భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పేర్కొంది. తాజా 'వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్' నివేదికలో 2026 సంవత్సరానికి భారత వృద్ధి అంచనాను 6.4 శాతానికి స్వల్పంగా తగ్గించినప్పటికీ, 2027లో వృద్ధి మరింత బలపడుతుందని వెల్లడించింది. దేశీయ డిమాండ్ బలంగా ఉండటం, ఇటీవలి ఆర్థిక గణాంకాలు ఆశాజనకంగా ఉండటం భారత ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలుస్తున్నాయని ఐఎంఎఫ్ వివరించింది. ఐఎంఎఫ్ రీసెర్చ్ విభాగం అధికారి డెనిజ్ ఇగాన్ మాట్లాడుతూ.. తాజా ఆర్థిక సూచీలు భారత ఆర్థిక వ్యవస్థలో నిలకడను చూపిస్తున్నాయని తెలిపారు. అయితే పశ్చిమాసియా ఉద్రిక్తతలతో పెరిగిన చమురు ధరలు, వాటి ప్రభావం దేశీయ ఇంధన ధరలపై పడటం వల్ల 2026 వృద్ధి అంచనాను స్వల్పంగా తగ్గించాల్సి వచ్చిందన్నారు. ఈ ఇంధన ఒత్తిడి 2027 నాటికి తగ్గుముఖం పట్టడంతో భారత వృద్ధి మళ్లీ 6.5 శాతం స్థాయికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ఐఎంఎఫ్ తాజా అంచనాలు విడుదల చేసింది. 2026లో ప్రపంచ వృద్ధి 3 శాతం, 2027లో 3.4 శాతంగా ఉంటుందని తెలిపింది. అయితే పశ్చిమాసియా ఘర్షణలు మరింత తీవ్రరూపం దాల్చితే చమురు ధరలు పెరగడంతో పాటు ప్రపంచ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. మరోవైపు కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో పెరుగుతున్న పెట్టుబడులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కొంత ఊతమిస్తున్నాయని కూడా ఐఎంఎఫ్ పేర్కొంది.


## టవర్లు లేకున్నా కాల్స్- బీఎస్ఎన్ఎల్ శాటిలైట్ ఫోన్ వచ్చేసింది!

-ఫోన్ ధర రూ.1.34 లక్షలుగా నిర్ణయం
-కొనుగోలుకు డాట్ అనుమతి తప్పనిసరి
-రక్షణ, విపత్తు సేవలకు ప్రత్యేకంగా రూపకల్పన
-దేశవ్యాప్తంగా 4జీ విస్తరణ కొనసాగిస్తున్న బీఎస్ఎన్ఎల్




మొబైల్ టవర్ సిగ్నల్ అందని ప్రాంతాల్లో కూడా కాల్స్ చేసుకునే అవకాశం కల్పిస్తూ బీఎస్ఎన్ఎల్ కొత్త శాటిలైట్ ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అడవులు, సముద్ర ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, విపత్తులు సంభవించిన చోట్ల కూడా ఈ ఫోన్‌తో మాట్లాడొచ్చు. అయితే ఇది సాధారణ స్మార్ట్‌ఫోన్‌లా ఎవరైనా కొనుగోలు చేసే అవకాశం మాత్రం లేదు. ఈ ఫోన్ ధర రూ.1,34,166. కొనుగోలు చేయాలంటే ముందుగా కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ (డాట్) నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అనుమతి లేకుండా శాటిలైట్ ఫోన్‌ను ఉండటం లేదా వినియోగించడం చట్టపరమైన సమస్యలకు దారి తీసే అవకాశం ఉందని బీఎస్ఎన్ఎల్ తెలిపింది. సాధారణ మొబైల్ ఫోన్లు సమీపంలోని టవర్ల ద్వారా పనిచేస్తాయి. కానీ ఈ శాటిలైట్ ఫోన్ నేరుగా ఉపగ్రహాలతో అనుసంధానం అవుతుంది. అందుకే సెల్యులర్ నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో కూడా వాయిస్ కాల్స్ చేసుకోవచ్చు. ఈ సేవల కోసం అంత ర్జాతీయ శాటిలైట్ నెట్‌వర్క్ సంస్థలతో కలిసి పనిచేస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ వెల్లడించింది. ఈ ఫోన్‌లో అత్యవసర పరిస్థితుల కోసం ఎస్‌వోఎస్ ఫీచర్‌ను కూడా అందించారు. ఒక్కసారి ఛార్జ్ చేస్తే ఎక్కువసేపు పనిచేసే బ్యాటరీ, కఠిన పరిస్థితులను తట్టుకునే బలమైన డిజైన్‌ను ఇందులో పొందుపరిచారు. అత్యవసర కమ్యూనికేషన్‌ను దృష్టిలో పెట్టుకొని దీన్ని రూపొందించారు. రక్షణ శాఖ, సముద్ర రవాణా, విపత్తు నిర్వహణ బృందాలు, గనుల పరిశ్రమ, మారుమూల ప్రాంతాల్లో పనిచేసే సంస్థలు, సాహస యాత్రికులు, దూర ప్రాంతాలకు వెళ్లే యాత్రికులను దృష్టిలో పెట్టుకొని ఈ ఫోన్‌ను రూపొందించినట్లు బీఎస్ఎన్ఎల్ తెలిపింది. సాధారణ వినియోగదారుల కోసం కాకుండా ప్రత్యేక అవసరాలున్న వారికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. ఇదిలా ఉండగా దేశవ్యాప్తంగా 4జీ సేవల విస్తరణపైనా బీఎస్ఎన్ఎల్ దృష్టి పెట్టింది. ఇప్పటికే దాదాపు 99 వేల 4జీ సైట్లను ప్రారంభించినట్లు సంస్థ వెల్లడించింది. మరిన్ని 4జీ టవర్ల ఏర్పాటుకు కూడా కేంద్రం అనుమతించే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది.

## భారత్‌తో వాణిజ్య ఒప్పందం.. న్యూజిలాండ్ వ్యాపారాలకు భారీ ఊతం: లక్సన్



భారత్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) న్యూజిలాండ్ వ్యాపారాలకు భారీ అవకాశాలు తీసుకురానుందని ఆ దేశ ప్రధాని క్రిస్టఫర్ లక్సన్ తెలిపారు. ఒప్పందం అమల్లోకి వచ్చిన తొలి రోజునే న్యూజిలాండ్ ఎగుమతుల్లో 57 శాతం వస్తువులు సుంకం లేకుండా భారత్‌లోకి ప్రవేశిస్తాయని వెల్లడించారు. ఈ మేరకు లక్సన్ సోషల్ మీడియాలో స్పందిస్తూ "భారత్‌తో వాణిజ్య ఒప్పందం న్యూజిలాండ్ వ్యాపారాలకు కొత్త దారులు తెరుస్తుంది" అని పేర్కొన్నారు. భారత్ వేగంగా విస్తరి స్తున్న వినియోగదారుల మార్కెట్‌గా మారుతోందని తెలిపారు. ఈ ఎఫ్‌టీఏ తమ దేశ ఆర్థిక ప్రయోజనాలకు కీలకంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జులై రేపు, ఎల్లుండి న్యూజిలాండ్‌లో పర్యటించనున్న నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. దాదాపు 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని న్యూజిలాండ్‌కు అధికారిక పర్యటన నిమిత్తం వెళ్లడం ఇదే మొదటిసారి. ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య, వ్యాపార సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని మోదీ తెలిపారు. 2025 మార్చిలో భారత్‌కు వచ్చిన లక్సన్ పర్యటన తర్వాత ద్వైపాక్షిక సంబంధాలు వేగంగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 27న భారత్, న్యూజిలాండ్ మధ్య కీలక ఎఫ్‌టీఏపై తుది నిర్ణయం తీసుకున్నారు. దీన్ని "తరతరాలకు ఉపయోగపడే అవకాశం"గా లక్సన్ అభివర్ణించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ ఎదుగుతున్న వేళ ఆ ప్రయాణంలో భాగస్వామ్యం కావడానికి ఈ ఒప్పందం న్యూజి లాండ్‌కు తోడ్పడుతుందని ఆయన అన్నారు. అటు, భారత్– న్యూజిలాండ్ సంబంధాల్లో ప్రవాస భారతీయుల పాత్ర కూడా ఎంతో ముఖ్యమని మోదీ గుర్తుచేశారు. న్యూజిలాండ్‌లో వివిధ రంగాల్లో రాణిస్తున్న భారతీయులను కలవాలని తాను ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

## వరుస ఓటములకు బ్రేక్ పడేనా? బరిలోకి దిగే భారత తుది జట్టు ఇదే!

స్పోర్ట్స్ డెస్క్:



శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు గురువారం ఇంగ్లండ్‌తో నాల్గో టీ20 పోరుకు సిద్ధమైంది. తొలి మ్యాచ్ వర్షం వల్ల రద్దు కాగా, తర్వాతి రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ప్రస్తుతం ఇంగ్లండ్ 2-0 ఆధిక్యంలో ఉంది. ముఖ్యంగా మూడో టీ20లో టీమిండియా కేవలం 76 పరుగులకే కుప్పకూలి, 125 పరుగుల భారీ తేడాతో ఘోర ఓటమి చవిచూసింది. కనీసం ఒక్క బ్యాటర్ కూడా 15 పరుగుల మార్కును దాటలేకపోవడం జట్టు బ్యాటింగ్ వైఫల్యాన్ని స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో సిరీస్‌ను కాపాడుకునేందుకు తుది జట్టులో కొన్ని కీలక మార్పులు చేసేందుకు టీమిండియా మేనేజ్‌మెంట్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఆకట్టుకోలేకపోయిన తిలక్ వర్మ (13, 24లి, 3 పరుగులు) స్థానంలో అనుభవజ్ఞుడైన సంజూ శాంసన్‌ను మిడిల్ ఆర్డర్‌లో ఆడించే యోచనలో టీమిండియా మేనేజ్‌మెంట్ ఉందని సమాచారం. ఓపెనర్లుగా అభిషేక్ శర్మతో పాటు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరో అవకాశం అందుకోనున్నాడు. వైభవ్ గత రెండు మ్యాచ్‌ల్లో భారీ స్కోర్లు చేయకపోయినా (14, 13 పరుగులు), అతని హిట్టింగ్ సామర్థ్యంపై నమ్మకం ఉంచారు. వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ మూడో స్థానంలో, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాల్గో స్థానంలో బరిలోకి దిగనున్నారని తెలుస్తోంది. ఆల్‌రౌండర్ల విభాగంలో శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణాలు తమ స్థానాలను నిలబెట్టుకోనున్నారు. ఇక బౌలింగ్ విభాగంలో పేసర్లుగా అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్ బాధ్యతలు పంచుకోనుండగా, స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా వరుణ్ చక్రవర్తి జట్టులో కొనసాగే అవకాశం ఉందని క్రీడా వర్గాలు అభిప్రాయప డుతున్నాయి. బ్యాటింగ్ పటిష్ఠతను పెంచుకుని, వరుస ఓటములకు అడ్డుకట్ట వేయాలని భారత్ పట్టుదలగా ఉంది.

-భారత తుది జట్టు (అంచనా):
అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), సంజూ శాంసన్/తిలక్ వర్మ, శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి.

## ఈజిప్ట్ ఆరోపణలను కొట్టిపారేసిన ఫిఫా రిఫరీయింగ్ చీఫ్

స్పోర్ట్స్ డెస్క్:




ఫిఫా ప్రపంచకప్ 2026లో భాగంగా అర్జెంటీనా, ఈజిప్ట్ జట్ల మధ్య జరిగిన రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్ వివాదస్పదంగా మారిన సంగతి తెలిసిందే. ఉత్కంఠభరితంగా సాగిన పోరులో ఈజిప్ట్ తొలి అర్ధలో 2-0 ఆధిక్యంలో నిలిచినప్పటికీ, అర్జెంటీనా అద్భుతంగా పుంజుకుని 3-2 తేడాతో విజయాన్ని అందుకుంది. అయితే, ఇంజూరీ టైమ్‌లో ఎంజో ఫెర్నాండెజ్ కొట్టిన విన్నింగ్ గోల్‌తో ఈజిప్ట్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ ఓటమిపై ఈజిప్ట్ ఫుట్‌బాల్ అసోసియేషన్, కోచ్ హోసామ్ హసన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, రిఫరీ నిర్ణయాలు అర్జెంటీనాకు అనుకూలంగా ఉన్నాయని, వారిని టోర్నీలో ఉంచడానికే ఒత్తిడికి లొంగి పక్షపాతంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై ఫిఫా రిఫరింగ్ చీఫ్ పీర్‌లూయిగి కొలినా ఇవాళ( గురువారం) స్పందించారు. మ్యాచుల విషయంలో అంపైర్ల నిర్ణయాలు పూర్తిగా స్వతంత్రమైనవని, వారి చిత్తశుద్ధిని ఎవరూ ప్రశ్నించలేరని స్పష్టం చేశారు. 'ఫుట్‌బాల్‌లో నిర్ణయాలపై చర్చ సహజం. కానీ నిరాధారమైన ఆరోపణలు చేయడం సరైనది కాదు. ఫిఫా అధ్యక్షుడే స్వయంగా చెప్పినా రిఫరీల నిర్ణయాలను ప్రభావితం చేయలేరు' అని కొలినా తేల్చిచెప్పారు. వీఏఆర్ రివ్యూలో అర్జెంటీనా డిఫెండర్ లిసాంద్రో మార్టినెజ్‌పై ఈజిప్ట్ ఆటగాడు ఫౌల్ చేసినట్లు స్పష్టంగా తేలిందని, అందుకే ఆ గోల్‌ను రద్దు చేశామని ఆయన పేర్కొన్నారు. అలాగే సలా విషయంలో జరిగింది సాధారణ ఫుట్‌బాల్ కాంటాక్ట్ మాత్రమేనని, అక్కడ ఫౌల్ లేదని పేర్కొన్నారు. ఇలాంటి నిరాధార ఆరోపణల కారణంగా రిఫరీలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# స్పోర్ట్స్

## గొప్ప కెప్టెన్ అవుతాడు.. శ్రేయస్‌కు మద్దతుగా నిలిచిన సోదరి శ్రేష్ఠ




స్పోర్ట్స్ డెస్క్:
టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు వరుసగా పరాజయాలు ఎదురువు తున్నాయి. ఐర్లాండ్ టూర్‌తో తొలిసారి జాతీయ జట్టు పగ్గాలు అందుకున్న శ్రేయస్ వరుస ఓటములు పలకరిస్తుండటంతో విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో అతడికి సోదరి శ్రేష్ఠ అయ్యర్ మద్దతుగా నిలిచింది. అంతేకాక భారత క్రికెట్ లెజెండ్స్ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, సచిన్ టెండూల్కర్‌ల కెప్టెన్సీ ఓటములను ఉదాహరణగా చూపించి.. తన సోదరుడిని విమర్శించే వారికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది.ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న శ్రేష్ఠ అయ్యర్ పలు విషయాలను వెల్లడించారు. ' సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ..వీళ్లంత క్రికెట్ లెజెండ్స్. వీళ్లు కూడా తమ కెరీర్‌లో ఎన్నో మ్యాచ్‌లు ఓడిపోయారు. కానీ ప్రతిసారీ శ్రేయస్‌నే విమర్శించడం సరికాదు. అలా చేస్తే సమస్య అతడిలో కాకుండా విమర్శించే వారిలోనే ఉండొచ్చు' అని ఆమె వ్యాఖ్యానించింది. మరోవైపు నెటిజన్లు శ్రేయస్‌ను దిగ్గజాలతో పోల్చొద్దని చెప్పినప్పటికీ.. శ్రేష్ఠ మాత్రం? తన సోదరుడిపై సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేసింది. 'శ్రేయస్ గొప్ప వ్యక్తిత్వం కలిగిన ఆటగాడు. అతడిలోచాలా ప్రతిభ ఉంది. సరైన సమయం వచ్చినప్పుడు అతడే భారత అత్యుత్తమ కెప్టెన్లలో ఒకడిగా గుర్తింపు పొందుతాడని నేను బలంగా నమ్ముతున్నాను' అని పేర్కొంది. మరోవైపు వరుస వైఫల్యాలు ఎదురైనా శ్రేయస్ అయ్యర్‌పై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు జట్టు మేనేజ్‌మెంట్ విశ్వాసం కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. టీ20 ప్రపంచకప్2028ను దృష్టిలో పెట్టుకుని యువ జట్టుతో కొత్త ప్రణాళికలు అమలు చేస్తున్న నేపథ్యంలో శ్రేయస్‌కు మరిన్ని అవకాశాలు లభించే అవకాశం ఉందని క్రీడా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

# ‘మైసా’ కోసం రష్మిక సాహసం అండర్‌వాటర్‌లో భారీ ఫైట్!

-‘మైసా’ చిత్రం కోసం అండర్‌వాటర్ ఫైట్ పూర్తి చేసిన రష్మిక
-ఇండియన్ సినిమాలో ఇదే తొలి ఫిమేల్ అండర్‌వాటర్ ఫైట్ సీక్వెన్స్
-డూప్ లేకుండా రెండు రోజుల్లో 20 గంటల పాటు చిత్రీకరణ
-తన కెరీర్‌లోనే ఇది అత్యంత సవాలుతో కూడిన పని అన్న నటి
-గిరిజన యువతి పాత్రలో యాక్షన్ థ్రిల్లర్‌తో రానున్న రష్మిక



ప్రముఖ కథానాయిక రష్మిక మందన్న తన తదుపరి చిత్రం ‘మైసా’ కోసం ఒక అరుదైన సాహసాన్ని ప్రదర్శించారు. భారతీయ చలనచిత్ర చరిత్రలో తొలిసారిగా ఒక కథానాయిక నీటి అడుగున భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను పూర్తి చేయడం విశేషం. ఈ ఉత్కంఠభరిత ఘట్టాన్ని ఎటువంటి డూప్ సహాయం తీసుకోకుండా రష్మిక స్వయంగా పూర్తిచేయడం గమనార్హం. ఈ విషయాన్ని తెలియజేస్తూ రష్మిక గురువారం సోషల్ మీడియా వేదికగా ఒక ఆసక్తికర పోస్ట్‌ను పంచుకున్నారు. “నా కెరీర్‌లో ఇంతకంటే సవాలుతో కూడిన పని ఇప్పటివరకు చేయలేదు. ఈ చిత్రం కోసం మేం ఎంతో శ్రమిస్తున్నాం, ఇదే నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోంది” అని పేర్కొంటూ స్విమ్మింగ్ పూల్‌లో ఉన్న ఒక చిత్రాన్ని షేర్ చేశారు. రెండు రోజుల వ్యవధిలో దాదాపు 20 గంటల పాటు నీటి అడుగున ఈ హై-ఇంటెన్సిటీ ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరించినట్లు చిత్ర బృందం వెల్లడించింది. రవీంద్ర పుల్ల దర్శకత్వంలో ‘మైసా’ చిత్రం ఒక ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. గిరిజన నేపథ్యంతో సాగే ఈ కథలో రష్మిక ఒక గోండు గిరిజన యువతిగా అత్యంత శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. “భారతీయ యాక్షన్ సినిమాలలో ఇది ఒక నూతన అధ్యాయం” అని చిత్ర నిర్మాణ సంస్థ అన్‌ఫార్ములా ఫిల్మ్స్ పేర్కొంది. ఈ విశిష్ట పాత్ర కోసం రష్మిక బ్యాంకాక్‌లో ప్రత్యేకంగా స్టంట్ శిక్షణ కూడా పొందారు. ఈ సినిమా టీజర్ అప్‌డేట్‌ను త్వరలోనే వెల్లడించనున్నట్లు, ఈ ఏడాదే చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.

# అఖిల్ ‘లెనిన్’.. శ్రీలీల స్థానంలో భాగ్యశ్రీ రావడానికి అసలు కారణం చెప్పిన నిర్మాత నాగవంశీ



-అఖిల్ ‘లెనిన్’ నుంచి శ్రీలీలను తప్పించడంపై వీడిన సస్పెన్స్
-డేట్స్ సర్దుబాటు కాకపోవడం వల్లే మార్చామన్న నిర్మాత నాగవంశీ
-శ్రీలీల స్థానంలో వచ్చిన భాగ్యశ్రీ నటనకు ప్రశంసల వెల్లువ
-భాగ్యశ్రీ కెరీర్‌కు కీలకంగా మారిన ‘లెనిన్’ చిత్రం
-రేపు ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న సినిమా

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన ‘లెనిన్’ చిత్రం విడుదలకు సిద్ధమైంది. రేపు (జులై 10న) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. అయితే, ఈ ప్రాజెక్ట్ మొదలైనప్పుడు హీరోయిన్‌గా శ్రీలీలను ప్రకటించి, ఆ తర్వాత ఆమె స్థానంలో భాగ్యశ్రీ బోర్సేను తీసుకోవడంపై అనేక ఊహాగానాలు చెలరేగాయి. ఈ పుకార్లకు చెక్ పెడుతూ, హీరోయిన్ మార్పు వెనుక అసలు కారణాన్ని నిర్మాత నాగవంశీ తాజాగా వెల్లడించారు. ఓ ఇంటర్వ్యూలో నాగవంశీ మాట్లాడుతూ.. శ్రీలీలను తప్పించడం వెనుక ఎలాంటి వివాదాలు లేవని, కేవలం డేట్స్ సర్దుబాటు కాకపోవడం వల్లే ఈ మార్పు జరిగిందని స్పష్టం చేశారు. “కథకు సంబంధించిన క్రియేటివ్ చర్చల వల్ల మా వైపు నుంచే కొంత ఆలస్యం జరిగింది. మేము షూటింగ్ ప్లాన్ చేసుకునే సమయానికి శ్రీలీల ఇచ్చిన డేట్స్ అందుబాటులో లేవు. ఆ తర్వాత ఆమెకు కార్తీక్ ఆర్యన్ సినిమా, ‘పరాశక్తి’ వంటి పెద్ద ప్రాజెక్టులు వచ్చాయి. మళ్లీ మేము షూటింగ్‌కు సిద్ధమయ్యేసరికి, ఆమె ఆ సినిమాలతో బిజీగా ఉండటంతో డేట్స్ క్లాష్ అయ్యాయి. ఆమెను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక, ఇరు పక్షాల అంగీకారంతోనే హీరోయిన్‌ను మార్చాల్సి వచ్చింది. ఇందులో శ్రీలీల పొరపాటు ఏమీ లేదు” అని నాగవంశీ వివరించారు. హీరోయిన్ మార్పుతో కొంత భాగం రీషూట్ చేయాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. అయితే, సినిమా ఫైనల్ కాపీ చూశాక, ఈ పాత్ర కోసమే భాగ్యశ్రీ పుట్టిందా అన్నంత అద్భుతంగా నటించిందని నాగవంశీ ప్రశంసించారు. ఇదే విషయంపై అక్కినేని నాగార్జున సైతం స్పందిస్తూ.. “భాగ్యశ్రీ నటన అమోఘం. ఆమె కోసం ఎన్ని యుద్ధాలైనా చేయొచ్చు అనిపించింది” అని కొనియాడారు. ‘మిస్టర్ బచ్చన్’ చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన భాగ్యశ్రీ బోర్సే, గ్లామర్‌తో యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంది. అయితే, ఆమెకు ఇప్పటివరకు సరైన కమర్షియల్ హిట్ పడలేదు. ఈ నేపథ్యంలో ‘లెనిన్’ విజయం అఖిల్‌తో పాటు భాగ్యశ్రీ కెరీర్‌కు కూడా ఎంతో కీలకంగా మారింది. ప్రస్తుతం సినిమాపై ఇండస్ట్రీలో పాజిటివ్ బజ్ నడుస్తుండటంతో, ఈ చిత్రంతో ఇద్దరూ భారీ విజయాన్ని అందుకుంటారని అక్కినేని అభిమానులు ఆశిస్తున్నారు.



# సెన్సార్ అడ్డంకులు దాటిన ‘జన నాయగన్’ జూలై 24న విజయ్ సినిమా

తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు విజయ్ చివరి చిత్రం ‘జన నాయగన్’ విడుదలకు ఎదురైన ప్రధాన ఆటంకాలు తొలగిపోయాయి. పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం తాజాగా సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఈ సినిమాకు ‘ఏ’ సర్టిఫికెట్ జారీ చేయడంతో, విడుదలకు మార్గం సుగమమైంది. ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామా నిడివి 183 నిమిషాలుగా (3 గంటల 3 నిమిషాలు) ఖరారైంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా నటించగా, మమితా బైజు, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితమైన ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. జూలై 24న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. నిజానికి ఈ సినిమాను 2026 జనవరి 9న సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని తొలుత భావించారు. అయితే, సెన్సార్ సమస్యలు, న్యాయపరమైన చిక్కులు, సీబీఎఫ్‌సీ రివైజింగ్ కమిటీ సమీక్ష వంటి కారణాల



వల్ల విడుదల వాయిదా పడుతూ వచ్చింది. చిత్రంలో కొన్ని మార్పుల చేసిన అనంతరం బోర్డు ఈ సినిమాకు ‘ఏ’ రేటింగ్ కేటాయించినట్లు సమాచారం.

# ‘ప్రీతమ్ అండ్ పెడ్రో’ (జియో హాట్ స్టార్) సిరీస్ రివ్యూ!

మొదటి నుంచి కూడా ఓటీటీ సెంటర్లలో థ్రిల్లర్ జోనర్ తన ఆధిపత్యాన్ని చాటుకుంటోంది. ఈ వరుసలో క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ లకు విశేషమైన ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ ఒకటి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హిందీలో రూపొందిన ఆ సిరీస్ పేరే ‘ప్రీతమ్ అండ్ పెడ్రో’. వీర్ హిరానీ .. అర్షద్ వార్సీ .. విక్రాంత్ మస్సే ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్ కి, రాజ్ కుమార్ హిరానీ దర్శకత్వం వహించాడు. ఈ నెల 3వ తేదీ నుంచి ఈ సిరీస్ ‘జియో హాట్ స్టార్’లో స్ట్రీమింగ్ అవుతోంది. ప్రీతమ్ (వీర్ హిరానీ) ‘గోవా’లో తన తాతయ్యతో కలిసి నివసిస్తుంటాడు. వాక్యూమ్ క్లీనర్స్ సేల్స్ మేన్ గా పనిచేస్తుంటాడు. తన తాతయ్య ఎంతో ప్రేమగా చూసుకునే పాత టేప్ రికార్డర్ .. అందులో తన నాయనమ్మ పాడిన పాట కేసెట్ ను ఎవరో కాజేస్తారు. ఆ విషయమై పోలీస్ స్టేషన్ కి ఫిర్యాదు చేయడానికి వెళతాడు ప్రీతమ్. ఆ సమయంలో ఒకశాావీ దొంగతనం కేసులో పోలీస్ ఆఫీసర్ పెడ్రో (అర్షద్ వార్సీ) బిజీగా ఉంటాడు. టెక్ జీనియస్ అయిన ప్రీతమ్, ఆ కేసు విషయంలో అతనికి సహకారించి దొంగలను పట్టిస్తాడు. అప్పటి నుంచి ప్రీతమ్ పట్ల పెడ్రో స్నేహ భావంతో ఉంటాడు. అదే సమయంలో ఒక కేసు విషయంలో స్పోర్ట్స్ మినిష్టర్ కి కోపాన్ని తెప్పించినందుకు ఫలితంగా, ‘పెడ్రో’ను క్రైమ్ డిపార్టుమెంట్ నుంచి సైబర్ సెల్ కి బదిలీ చేస్తారు. ఏ మాత్రం అనుభవం లేని పెడ్రో, ఈ విషయంలో తనకి సహకరించమని ప్రీతమ్ ను కోరతాడు. అలా చేస్తే అతని తాతయ్య టేప్ రికార్డర్ ను తాను కనిపెడతానని మాట ఇస్తాడు. అందుకు ప్రీతమ్ అంగీకరిస్తాడు. స్పోర్ట్స్ మినిష్టర్ పదేళ్ల కొడుకు వినీత్ కిడ్నాప్ కి గురవుతాడు. తనకి 5 కోట్ల రూపాయలు ఇస్తే, వినీత్ ను వదిలేస్తానని కిడ్నాపర్ హెచ్చరిస్తాడు. ఈ కేసును ఛేదించి మినిష్టర్ దగ్గర మార్కులు కొట్టేసి, మళ్లీ క్రైమ్ డిపార్మెంట్ కి వెళ్లిపోవాలనే ఆలోచనలో పెడ్రో ఉంటాడు. అతనికి సహకరించడానికి ప్రీతమ్ కూడా రంగంలోకి దిగుతాడు. కిడ్నాపర్ వెనుక ఒక జీనియస్ హ్యాకర్ ఉన్నాడనే విషయం ప్రీతమ్ కి అర్థమవుతుంది. అదే సమయంలో ప్రీతమ్ వైపు నుంచి తనకి తెలియని ఫ్లాష్ బ్యాక్ ఏదో ఉందనే సంగతిని పెడ్రో కనిపెడతాడు. అయితే పెడ్రో జీవితంలోను ఒక విషాదకరమైన సంఘటన జరుగుతుంది. ఆ సంఘటనను మరిచిపోవడానికి ప్రయత్నిస్తూనే అతను తన డ్యూటీ చేసుకు వెళుతుంటాడు. అతణ్ణి అంతగా కలిచివేస్తున్న ఆ సంఘటన ఏమిటి? వినీత్ ను కిడ్నాప్ చేసింది ఎవరు? ఆ కిడ్నాప్ వెనకున్న హ్యాకర్ ఎవరు? ఆ హ్యాకర్ కీ .. ప్రీతమ్ కి మధ్య ఉన్న సంబంధం ఏమిటి? టెక్ జీనియస్ అయిన ప్రీతమ్, చిన్నపాటి జాబ్ ఎందుకు చేస్తున్నట్టు? ప్రీతమ్ ఫ్లాష్ బ్యాక్ కీ .. వినీత్ కిడ్నాప్ కి ఉన్న సంబంధం ఎలాంటిది? అనేది మిగతా కథ. ఒక మినిష్టర్ కొడుకు కిడ్నాప్ అవుతాడు. సైబర్ సెల్ కి సంబంధించి ఆ కేసును పరిష్కరించడానికి పెడ్రో రంగంలోకి దిగుతాడు. ఆ కుర్రాడిని కాపాడటానికి పెడ్రోకి సహకరిస్తుంటాడు ప్రీతమ్. ఆ కుర్రాడు ఒక హ్యాకర్ చేతిలో బందీగా ఉంటాడు. ప్రీతమ్ పై ఆ హ్యాకర్ ప్రతీకారంతో ఉంటాడు. అందుకు గల కారణాలు ఏమై ఉంటాయనే సందేహాలను ఆడియన్స్ లో రేకెత్తిస్తూ ఈ కథ ముందుకు వెళుతుంటుంది. ప్రతీకారంతో ఒక హ్యాకర్ .. పశ్చాత్తాపంతో మరో హ్యాకర్ ఉంటాడు. వారి గతం గురించి ఏ మాత్రం తెలియని పోలీస్ ఆఫీసర్ పెడ్రో, ఇద్దరి మధ్యా ఉంటాడు. ఈ మూడు ప్రధానమైన పాత్రల చుట్టూనే ఈ కథ పరిగెడుతూ ఉంటుంది. ప్రస్తుతం నడుస్తున్న కథతో పాటు, సందర్భాన్ని బట్టి వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ కూడా చాలా ఆసక్తికరంగా నడుస్తాయి. సీరియస్ నెస్ ఎక్కడా మిస్సవ్వకుండా చూసుకుంటూనే కామెడీ టచ్ ఇచ్చిన విధానం బాగుంది. తొందరపాటు తనంతో చేసే కొన్ని పనులు, అవతలివారికి ఒక జీవితకాలానికి సరిపడా నష్టాన్ని కలిగిస్తాయి. బాధితులలో నుంచి ఒక శత్రువు పుట్టుకొస్తే .. ఆ శత్రువు నీడలా వెంటాడం మొదలు పెడితే .. అతనికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై మంచి పట్టు ఉంటే ఏం జరుగుతుంది? అనే అంశాన్ని ప్రధానంగా తీసుకుని దర్శకుడు ఈ కథను అల్లుకున్నాడు. కాగితంపై తాను రాసుకున్న సన్నివేశాలను అంతే గొప్పగా తెరపై ఆవిష్కరించగలిగాడు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం .. దానిని ఒళ్లంతా నింపుకున్న స్మార్ట్ ఫోన్ మనుషుల జీవితాలను ప్రభావితం చేస్తోంది. ఎంతో ఉపయోగకరమైనదైన స్మార్ట్ ఫోన్, అంతే ప్రమాదకారిగాను మారిపో యింది. స్మార్ట్ ఫోన్ ఆధారంగా సాధించలేనిది లేదు అన్నట్టుగా నేరగాళ్లు వాటిని తమ ఆయుధాలుగా మార్చుకుని, చిన్న పిల్లల మొదలు పెద్దల వరకూ ఎలా ప్రమాదాలలోకి నెడుతున్నాయనేది చూపించిన తీరు బాగుంది. ఒక ఎపిసోడ్ కి మించి మరొక ఎపిసోడ్ ఉత్కంఠను రేకెత్తిస్తుంది. ఎక్కడా లూజ్ సీన్స్ అనేవి కనిపించవు. స్క్రీన్ ప్లే చాలా బలంగా కనిపిస్తుంది. కథలో ఏ సన్నివేశం చూస్తున్నాఏ పాత్రను పరిశీలించినా సహజత్వానికి చాలా దగ్గరగా ఆవిష్కరించిన తీరు ప్రశంసనీయంగా అనిపిస్తుంది. మన కళ్లముందు నిజమైన ఇన్వెస్టిగేషన్ జరుగుతున్న భావన కలుగుతుంది. ప్రతి ఆర్టిస్ట్ నటన ఆకట్టుకుంటుంది.




Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449